RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | ఆదివారం, ఏప్రిల్ 26, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 20 | పేజీలు: 8 | వెల : రూ.1



ఏపీలో మరోసారి

**చమురు షాక్!**

::: వినియోగదారులకు చుక్కలు..!

# కవిత కొత్త పార్టీతో తెలంగాణ రాజకీయాల్లో సంచలనం

# “టీఆర్ఎస్” ఆవిర్భావంపై ఉత్కంఠ

**టీఆర్ఎస్ పేరుతో కవిత**
**కొత్త రాజకీయ ప్రయాణం**
**తెలంగాణలో చతుర్ముఖ పోటీకి తెర**




**హైదరాబాద్, ఏప్రిల్ 25: వాయిస్ టుడే**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రకటించడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మేడ్చల్ జిల్లాలోని మునీరాబాద్‌లో జరిగిన భారీ ఆవిర్భావ సభలో ఆమె తన పార్టీ పేరును లి“తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)”లిగా ప్రకటించారు.

కవిత 1978లో కరీంనగర్‌లో జన్మించారు. జేఎన్టీయూ నుంచి బీటెక్ పూర్తి చేసిన ఆమె, అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ సదరన్ మిస్సిస్సిపీ నుంచి మాస్టర్ డిగ్రీ పొందారు. 2004లో భారత్‌కు తిరిగి వచ్చి ఆమె తెలంగాణ జాగృతి సంస్థను స్థాపించి మలి దశ తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యారు పార్టీ ఆవిష్కరణకు ముందు కవిత అమరవీరుల స్థూపం, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహాలకు నివాళులర్పించి అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు.

### కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు

సభలో మాట్లాడిన కవిత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. “తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. ప్రజల్లో భయం పెరిగింది. పార్టీ ఆత్మ కోల్పోయింది” అంటూ వ్యాఖ్యానించారు.

### కొత్త పార్టీ లక్ష్యం -- “సామాజిక తెలంగాణ”

కవిత తన పార్టీ ప్రధాన లక్ష్యం సామాజిక న్యాయం సాధించడమేనని స్పష్టం చేశారు. విద్య, వైద్యం, రైతు సంక్షేమం, యువత ఉపాధి, సామాజిక సమానత్వం తమ అజెండా అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సేన ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. “రాజకీయ పార్టీకి ఆత్మ ఉండాలి. బీఆర్ఎస్ ఆ ఆత్మను కోల్పోయింది. అందుకే కొత్త పార్టీ అవసరమైంది” అని వివరించారు.

### కాంగ్రెస్--బీఆర్ఎస్--బీజేపీపై పోరాటం

మూడు ప్రధాన పార్టీలపై రాజకీయ పోరాటం కొనసాగిస్తామని కవిత ప్రకటించారు. ప్రజల కోసం కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం తీసుకువస్తామని చెప్పారు.సాధారణంగా కొత్త పార్టీలు అధికార పార్టీని విమర్శించడం ద్వారా ఉనికిని చాటుకుంటాయి. కానీ కవిత మాత్రం అధికార కాంగ్రెస్‌ను , దూకుడుగా ఉన్న బీజేపీని కాకుండా, బీఆర్ఎస్ మీదనే ఎక్కువ దృష్టి సారించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు సిద్ధాంతపరంగా ఆమె వైపు వచ్చే అవకాశం లేదని, అలాగే బీజేపీ హిందూత్వ ఓటు బ్యాంకు తన దరి చేరదని ఆమెకు బాగా తెలుసు. అందుకే, గత పదేళ్లుగా బీఆర్ఎస్ వెన్నంటి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకును, ఆ పార్టీ పట్ల అసంతృప్తిగా ఉన్న శ్రేణులను తన వైపు తిప్పుకోవడమే ఆమె సింగిల్ పాయింట్ అజెండా గా కనిపిస్తోంది. బీఆర్ఎస్ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో కవిత ఎంట్రీ ఆ పార్టీకి పెనుగండంగా మారేలా ఉంది. బీఆర్ఎస్ వైఫల్యాలను, ముఖ్యంగా మలి దశ తెలంగాణ ఉద్యమకారులకు జరిగిన అన్యాయాన్ని ఆమె పదే పదే ప్రస్తావిస్తుండటం యాధృచ్ఛికం కాదు. రేజరగబోయే ఆవిర్భావ సభలో కూడా ఆమె ప్రసంగం బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకునే సాగే అవకాశం ఉంది. తండ్రి చాటు బిడ్డగా కాకుండా, తెలంగాణ ఆకాంక్షలను మోసే స్వతంత్ర గళంగా తనను తాను ఆవిష్కరించుకోవడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌లో చీలిక తీసుకురావడమే ఆమె అసలు ప్లాన్. రాజకీయాల్లో కేవలం సెంటిమెంట్‌తోనే ఓట్లు పడవని గుర్తించిన కవిత, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలహీనపడిన చోట తన పట్టును పెంచుకోవాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చెల్లాచెదురైతే, అది కాంగ్రెస్‌కో లేదా బీజేపీకో వెళ్లకుండా తన కొత్త పార్టీ ఒక షెల్టర్ లాగా ఉపయోగపడాలని ఆమె ఆశిస్తున్నారు. ఈ వ్యూహం గనుక పారితే, బీఆర్ఎస్ ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఒక రకంగా చెప్పాలంటే, బీఆర్ఎస్ పునాదుల మీదనే తన రాజకీయ సౌధాన్ని నిర్మించుకోవాలని కవిత గట్టి నిర్ణయానికి వచ్చారు. రాజకీయాల్లో బంధుత్వాలు ఉండవు.. కేవలం బాధ్యతలే ఉంటాయి అనే సంకేతాన్ని కవిత ఇప్పటికే ఇచ్చారు. కేసీఆర్ అనుసరించిన కొన్ని విధానాలను ఆమె బహిరంగంగానే తప్పుపట్టడం ద్వారా, తాను బీఆర్ఎస్ బి–టీమ్ కాదనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఆవిర్భావ సభ తర్వాత ఆమె చేపట్టబోయే కార్యక్రమాలు కూడా బీఆర్ఎస్ కంచుకోటలుగా ఉన్న జిల్లాల్లోనే ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేశారు. ఇది కచ్చితంగా గులాబీ దళానికి ఒక హెచ్చరిక లాంటిదే. కవిత రాజకీయ చదరంగంలో తొలి పావును అత్యంత తెలివిగా కదిపారు. ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీజేపీలను వదిలేసి, తన సొంత ఇంటి ఓటు బ్యాంకుపైనే ఆమె యుద్ధం ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తోంది.

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, కవిత పార్టీ ఎంట్రీతో తెలంగాణ రాజకీయాలు మరింత క్లిష్టతరం కానున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ కొనసాగుతున్న నేపథ్యంలో ఇది లిచతుర్ముఖ పోటీగా మారే అవకాశంలి ఉంది. బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌లో చీలిక ఏర్పడితే అది ఇతర పార్టీలకు లాభం చేకూర్చవచ్చని భావిస్తున్నారు.

**5 ప్రధాన హామీలు**

కవిత ప్రకటించిన ప్రధాన హామీలు:

- ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య
- అన్ని ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం
- రైతు సంక్షేమ పథకాలు
- యువతకు ఉద్యోగాలు, రుణ సహాయం
- సామాజిక న్యాయానికి ప్రత్యేక ప్రాధాన్యం
- రాజకీయ విశ్లేషణ-కొత్త సమీకరణాలు

### ఎన్నికల సంఘం అనుమతి అంశం

“టీఆర్ఎస్” పేరుపై ఎన్నికల సంఘం అనుమతి అంశం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ పేరు రాజకీయ చరిత్రలో ఉండటంతో నిబంధనల పరంగా స్పష్టత అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### బీఆర్ఎస్ స్పందన

కవిత ప్రకటనపై బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ “ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే” అంటూ పరోక్షంగా వ్యాఖ్యలు చేసింది.

### ఆస్తులు, అప్పులపై చర్చ

తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కేసీఆర్ కుమార్తె కవిత ఇప్పుడు తన సొంత రాజకీయ పార్టీతో ప్రజల పరీక్షను ఎదుర్కోనున్నారు. అయితే ఆమెకు ఉన్న ఆస్తులు ఎన్ని, ఆమె ఇన్‌కమ్ సోర్స్ ఏంటనే చర్చ సాగుతోంది.కవిత రాజకీయ ప్రవేశంతో పాటు ఆమె ఆస్తులు, పెట్టుబడులు, అప్పుల వివరాలు కూడా మళ్లీ చర్చలోకి వచ్చాయి. గత ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం ఆమె ఆస్తులు 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆమె సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఆమె మొత్తం ఆస్తుల విలువ 7. 63 కోట్లుగా ఉంది. అయితే 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి ఆస్తులు పెరిగినట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అప్పుడు చెప్పిన వివరాల ప్రకారం ఆమె ఆస్తులు విలువ 39.79 కోట్లు దాటింది. అంటే కేవలం ఆ మూడేళ్ల వ్యవధిలోనే ఆమె ఆస్తులు దాదాపు రెట్టింపు కంటే ఎక్కువ పెరిగాయి. ఇందులో చరాస్తుల విలువ రూ. 14. 78కోట్లు కాగా, స్థిరాస్తుల విలువ 5.70 కోట్లుగా ఉంది. కవిత వాహనాల వినియోగంపై కూడా ప్రజల్లో ఆసక్తి ఉంది.అదే సమయంలో గణనీయమైన రుణాలు కూడా ఉన్నట్లు సమాచారం.

### ముగింపు

మొత్తంగా కవిత కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. ఈ పార్టీ భవిష్యత్తులో ఎంత మేర ప్రభావం చూపుతుందో, రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఎలా మార్చుతుందో చూడాలి.



# మే 25 నుంచే వానలు

**హైదరాబాద్, ఏప్రిల్ 25, (వాయిస్‌టుడే)**

ఈ సామి మార్చి మొదటి నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్ ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, భారత దేశంలోని చాలా ప్రాంతాలు తీవ్రమైన ఎండలతో జనాలు అల్లాడిపోతున్నాయి. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 43–44 డిగ్రీలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ ఎండలు మరింత ముదిరే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలోనే దేశ ప్రజలకు మరో చల్లని శుభవార్త కూడా చెప్పింది. గతంతో పోల్చుకుంటే ఈసారి నైరుతి రుతుపవనాలు ముందే దేశాన్ని చేరుకుంటాయిన తెలిపింది.యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం–రేంజ్ వెదర్ ఫోర్కాస్ట్స్ అంచనాల ప్రకారం, ఈసారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే పలకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మే చివరి నాటికే దక్షిణ భారతదేశంలో వర్షాలు కురిసే

(మిగతా 2వ పేజీలో)

# కొత్త డీజీపీగా సీవీ ఆనంద్?

**హైదరాబాద్, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే)**



తెలంగాణకు కొత్త పోలీస్ బాస్ రానున్నారు. తదుపరి డీజీపీగా 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న పదవీ విరమణ చేయనుండటంతో.. యూపీఎస్సీ పంపిన ముగ్గురు సీనియర్ల జాబితాలో అత్యంత సీనియర్ అయిన ఆనంద్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. హోంశాఖలో ఇటీవల జరిగిన ఐపీఎస్ బదిలీలు కూడా ఈ మార్పును ధృవీకరిస్తున్నాయి. ఈ నెలాఖరులోగా దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.తెలంగాణకు కొత్త డీజీపీ రానున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి, 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్‌ను తదుపరి డీజీపీగా నియమించేందుకు ప్రభుత్వం దాదాపు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో.. కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించి కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇప్పటికే ముగ్గురు అర్హులైన అధికారుల పేర్లతో కూడిన జాబితాను రాష్ట్రానికి పంపింది.యూపీఎస్సీ పంపిన ఆ జాబితాలో సీవీ ఆనంద్‌తో పాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్య మిశ్రా పేర్లు ఉన్నాయి. అయితే ఈ ముగ్గురిలో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ కావడం, క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల నిర్వహణలో ఆయనకు ఉన్న అపార అనుభవం ఆయనకు కలిసి వచ్చే అంశాలు. ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆనంద్.. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐపీఎస్ అధికారుల బదిలీలు కూడా సీవీ ఆనంద్ డీజీపీ అవుతారనే ప్రచారానికి మరింత బలం చేకూర్చాయి. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఆనంద్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి.. ఆ స్థానాన్ని శిఖాగోయెల్‌కు అప్పగించారు. ఇది ఆయనను డీజీపీ పదవికి కేటాయించడానికేనని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఒకవైపు సీనియారిటీ, మరోవైపు ప్రభుత్వ నమ్మకాన్ని గెలుచుకున్న అధికారి కావడంతో సీవీ ఆనంద్ పేరు దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవీకాలం ముగిసేలోగా.. అంటే ఈ నెలాఖరులోపు కొత్త డీజీపీ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆమోదం లభించిన వెంటనే హోంశాఖ జీవో విడుదల చేయనుంది.ఇక తెలంగాణలో పలువురు సీనియర్ ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1994 బ్యాచ్‌కు చెందిన శిఖాగోయెల్‌ను హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించారు. ప్రస్తుతం ఆమె విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ఉన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్‌గానూ కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏసీబీ డైరెక్టర్‌గా ఉన్న 2004 బ్యాచ్ ఐపీఎస్ డా.తరుణ్‌జోషిని ఫ్యూచర్‌సిటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) ఐజీపీగా ఉన్న 2006 బ్యాచ్ ఐపీఎస్ సుమతిని మల్కాజిగిరి కమిషనర్‌గా నియమించారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
ఆదివారం, ఏప్రిల్ 26, 2026

# పేటెంట్స్ కోసం ప్లానింగ్

**హైదరాబాద్, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే)**

శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థుల సృజనాత్మకతకు చట్టబద్ధమైన గుర్తింపునిచ్చేందుకు ఉస్మానియా , జేఎన్‌టీయూ (విశ్వవిద్యాలయాలు నడుం బిగించాయి. సాధారణంగా న్యాయశాస్త్ర విద్యార్థులకే పరిమితమైన 'మేధో హక్కుల పరిరక్షణ' అంశంపై ఇప్పుడు సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు కూడా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాయి. వినూత్న ఆవిష్కరణలు చేసే విద్యార్థులకు తమ పేటెంట్ హక్కులను ఎలా కాపాడుకోవాలో నేర్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.ప్రతి ఏటా ఒక్కో విశ్వవిద్యాలయం నుండి కనీసం మూడు పేటెంట్లు, రెండు ట్రేడ్ మార్కు హక్కుల దరఖాస్తులు దాఖలు చేసేలా రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సాంకేతిక సహకారాన్ని అందిస్తోంది. ఇందుకోసం ఉస్మానియా యూనివర్సిటీలో 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్' కోర్సును అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులు తమ 3వ లేదా 4వ సెమిస్టర్లలో ఈ కోర్సును అభ్యసించడం ద్వారా పరిశోధనలు, సాఫ్ట్‌వేర్ కాపీరైట్స్ వంటి అంశాలపై పూర్తి అవగాహన పొందే అవకాశం ఉంది.




**ఉపాధి అవకాశాలు..**

ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి బహుళజాతి సంస్థల్లో అద్భుతమైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఐటీ సంస్థలకు కన్సల్టెంట్లుగా వ్యవహరిస్తూ సొంతంగానూ ఎదగవచ్చు. ఓయూలో న్యాయశాస్త్రంతో పాటు ఈ ప్రత్యేక కోర్సులు చదివిన విద్యార్థులు ఎంఎన్‌సీలలో ఏడాదికి రూ. 30 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు జీతాన్ని అందుకుంటున్నారు. యూపీకి చెందిన ముగ్గురు విద్యార్థులు నెలకు రూ. 8 లక్షల వేతనంతో సలహాదారులుగా నియమితులయ్యారు. ఎల్.ఎల్.ఎమ్ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులు మధ్యప్రదేశ్‌లోని ఐటీ కంపెనీల్లో రూ. 26 లక్షల వార్షిక వేతనంతో కన్సల్టెంట్ కొలువులు సాధించారు.

మొత్తానికి, విద్యార్థుల మేధస్సుకు చట్టపరమైన రక్షణ కల్పిస్తూనే, వారి భవిష్యత్తుకు ఈ కోర్సులు బంగారు బాటలు వేస్తున్నాయి.

# భూముల విలువల సవరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే)**

తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను మే మొదటి వారం నుంచి సవరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉపసంఘం దీనిపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య చైనా తరహా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేయడంతో పాటు 'హిల్ట్' విధానం ద్వారా పారదర్శక పద్ధతిలో భూ వినియోగ మార్పిడి చేపడతామని స్పష్టం చేసింది. పారిశ్రామికవేత్తల సూచనల మేరకు రాయితీలు, కొత్త జోన్ల కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి సారించింది.తెలంగాణలో ఆదాయ వనరుల పెంపుదల, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం దూకుడు పెంచింది. మే మొదటి వారం నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురావాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను 'ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం' ఆదేశించింది. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులతో పాటు పారిశ్రామిక ఎస్టేట్ల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తూనే.. భూ విలువల సవరణ ద్వారా ఖజానాకు అదనపు ఆదాయాన్ని చేకూర్చడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం చెబుతోంది. పారిశ్రామిక రంగానికి సంబంధించి అనేక వినూత్న ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాలను చైనా తరహాలో ప్రత్యేక పారిశ్రామిక పార్కులుగా అభివృద్ధి చేయాలని పారిశ్రామికవేత్తలు కోరగా.. ప్రభుత్వం దానికి సానుకూలత వ్యక్తం చేసింది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ విధానాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎటువంటి నగదు బదిలీలకు తావులేకుండా అమలు చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. పరిశ్రమల వల్ల కాలుష్యం ఉండకూడదని అదే సమయంలో అవి లాభసాటిగా నడవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.అయితే హిల్ట్ పాలసీపై రాజకీయంగా తలెత్తుతున్న కొన్ని విమర్శలను పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు కొట్టిపారేశారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విధానం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని కొందరు నేతలు భయపెట్టే ప్రయత్నం చేశారని కానీ పారదర్శకమైన




ఈ విధానంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని తాము భావిస్తున్నట్లు తెలిపారు. భూ వినియోగ మార్పిడి ఛార్జీలను రోడ్డు విస్తీర్ణాన్ని బట్టి 30 శాతం నుంచి 50 శాతం వరకు నిర్ణయించారని అయితే వీటిని స్వల్పంగా తగ్గించాలని పారిశ్రామికవేత్తలు విజ్ఞప్తి చేశారు. రాయితీలు ఇవ్వకపోయినా సరే పరిశ్రమల స్థాపనకు తగినంత భూమిని కేటాయించాలని వారు కోరారు.మరోవైపు, రాష్ట్రంలోని అన్ని శాఖల పరిధిలో ఉన్న భూముల వివరాలను సమగ్రంగా సేకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న భూములు, ఆక్రమణకు గురైన ప్రాంతాలు, ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న స్థలాల డేటాను సిద్ధం చేయాలని సూచించారు. అన్ డెవలప్డ్ ల్యాండ్ పాలసీ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయాలు రాష్ట్రంలో పారిశ్రామిక రూపురేఖలను మార్చడమే కాకుండా.. పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించే అవకాశం ఉంది.

# పోలీసుల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

సిద్ధిపేట : సిద్దిపేట పోలీస్ కమీషనర్ రష్మీ పెరుమాల్ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా జరిగింది. ఐటి, ఫార్మా తో పాటు దాదాపు 150 కంపెనీ లు ఇందులో పాల్గొన్నాయి 624 మంది ఉద్యోగం పొందారు అని తెలిసింది . సిద్దిపేట జిల్లా పోలీస్ యంత్రంగం అంతా జాబ్ మేళా లో పాల్గొనడం విశేషం!. సీపీ ప్రతి స్టాల్ ను సందర్శిస్తూ సెలెక్ట్ అయిన యువతీ యువకులకు స్వయంగా నియామక పత్రాలు అందజేసారు. పోలీస్ లు అంటే లా అండ్ ఆర్డర్ కాపాడటమే కాదు అని సిద్దిపేట పోలీస్ నిరూపించారు. మన ఊరు మన పల్లె పేరుతో కూడా సిద్దిపేట సీపీ సామజిక కార్యక్రమం లో పాల్గొంటున్నారు పలు అంశాల పట్ల ప్రజల్ని చైతన్యం చేస్తున్నారు. సమాజం లో యువత సరైన అవకాశాలు లేక చెడు దారులను ఎంచుకుంటున్నారు... జాబ్ ఎలా ఎక్కడ చేయాలో చాలా మందికి అవగాహనా కూడా ఉండటం లేదు. సో అందరికి ఒక అవకాశం ఇస్తే తమ ప్రతిభ నిరూపించుకుని ఉద్యోగం సాధిస్తారని భావించి జాబ్ మేళా నిర్వహించినట్టు సీపీ తెలిపారు. సామాజిక బాధ్యత గా భావించి, సమాజానికి మనం కూడా ఎంతో కొంత సేవ చేయాలనీ జాబ్ మేళా చేపట్టామని సిద్దిపేట త్రీ టౌన్ సిఐ లక్ష్మణ్ బాబు అన్నారు. అప్పోయింట్మెంట్ ఆర్డర్ తీసుకున్న యువత కళ్ళ లో ఆనందం చూస్తే ఎంతో గొప్ప ఫీలింగ్ కలిగిందన్నారు... మధ్యాహ్నం వరకు వివిధ కంపెనీ లలో వందకు పైగా యువత సెలెక్ట్ అయ్యారు




# జూన్ నాటికి పోలవరం జలాలు



కాకినాడ, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే) : ఉత్తరాంధ్ర జిల్లాల సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చడంలో గోదావరి జలాలు అత్యంత కీలకమని, ఈ నీటిని తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. జూన్ నాటికి మొదటి దశ పనులను పూర్తి చేసి, అనకాపల్లి వరకు గోదావరి జలాలను తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి ఈరోజు స్వయంగా పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల సమీపంలో నేషనల్ హైవే క్రాసింగ్ వద్ద జరుగుతున్న వంతెనల నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఆయన, అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పనుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని ఏజెన్సీలను హెచ్చరించారు. ముఖ్యంగా హైవే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి ఎద్దడి లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మంత్రి ఆరోపించారు. జగన్ ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజలపై కక్ష గట్టి పనులను ప్రీ-క్లోజర్ చేసిందని, కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గించి ప్రాంతీయ ప్రయోజనాలకు గండికొట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును, రెండో ప్రాధాన్యతగా ఈ ఎడమ కాలువను సందర్శించారని గుర్తుచేశారు.ప్రస్తుతం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి పనులను పరుగులు పెట్టిస్తున్నామని, ఇప్పటివరకు 76 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం వల్ల 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే మరో 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మందికి శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుందన్నారు. అలాగే పాయకారావుపేట ఎగువన ఉన్న 98 ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాలకు నీరందుతుందని పేర్కొన్నారు. కుమ్మరిలోవ నిర్వాసితులకు రూ.30.38 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వెల్లడించిన మంత్రి, ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.

# మే 25 నుంచే వానలు

సూచనలు కనిపిస్తున్నాయి. మే 18 నుండి 25 మధ్య నైరుతి రుతుపవనాలు అండమాన్ మరియు నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో సాధారణం కంటే 30 నుండి 60 మి.మీ ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయిని స్పష్టం చేశాయి.ఇక మే 25 నుండి జూన్ 1 మధ్య ఈ రుతుపవనాలు పశ్చిమ దిశగా కదిలి కేరళ తీరాన్ని, తమిళనాడులోని దక్షిణ జిల్లాలను తాకవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. రుతుపవనాల ప్రభావంతో అండమాన్ ఉత్తర ప్రాంతంలో ఒక ఉష్ణమండల వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉందని.. దీని కారణంగా రుతుపవనాలు మరింత వేగంగా ముందుకు కదులుతాయని స్పష్టం చేసింది.గతేడాదిలో కూడా రుతుపవనాలు అంచనా వేసిన దానికంటే ముందే కేరళ తీరాన్ని తాకాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతమైతే, మే 25 నాటికే రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే, ఎండలతో అల్లాడుతున్న కోట్లాది మంది ప్రజలకు ఉపశమనం లభించడమే కాకుండా, వ్యవసాయ పనులు కూడా త్వరగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



## ఏపీలో మరోసారి చమురు షాక్..!
## ::: వినియోగదారులకు చుక్కలు..!

తిరువూరు/ ఏప్రిల్ 25 : ఏపీలో మరోసారి పెట్రోల్, డీజిల్ సంక్షోభం (ఖీబవశ్రీ జతీఱంఱం) తలెత్తేలా కనిపిస్తోంది. రాష్ట్రంలో నిన్నటి నుండి పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొరత ఏర్పడటంతో వినియోగదారులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఇంకొన్ని చోట్ల రెండు రోజులుగా చమురు కొరత ఉందని చెప్తున్నారు. చమురు కంపెనీలు క్రెడిట్ సౌకర్యం నిలిపివేయడమే ఇందుకు కారణమని కొన్ని పెట్రోల్ బంకుల యజమానులు చెప్తున్నారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరలు, సరఫరా ఇబ్బందులు కారణమని ఇంకొందరు చెప్తున్నారు. యన్ టి ఆర్ జిల్లా తిరువూరు మండలంతో పాటు దాని పరిసర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరత వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా రిలయన్స్ బంక్, ఇండియన్ బంక్ ఉన్నటువంటి కీలక పెట్రోల్ బంకుల్లో 'నో డీజిల్' బోర్డులు దర్శనమిస్తుండటంతో ప్రయాణికులు, రైతులు బెంబేలెత్తిపోతున్నారు.




## పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కథ ముగిసింది... లైసెన్స్ రద్దు చేసిన ఆర్బీఐ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రముఖ యూపీఐ ఆధారిత ఆర్థిక సేవల సంస్థ పేటీఎంకు చెందిన పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ లైసెన్సును రద్దు చేసింది. నేడు (ఏప్రిల్ 24వ తేదీన) పనివేళలు ముగిసిన తర్వాత ఈ రద్దు నిర్ణయం అమల్లోకి వస్తుందని ఆర్బీఐ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949, సెక్షన్ 22(4) కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్బీఐ తెలిపింది. ఈ నిర్ణయంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ తక్షణమే ఎలాంటి బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించకుండా నిషేధం విధించింది. బ్యాంకును పూర్తిగా మూసివేసే (వైండింగ్ అప్) ప్రక్రియ కోసం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కూడా వెల్లడించింది. అయితే, డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్బీఐ భరోసా ఇచ్చింది. బ్యాంకు వద్ద ఉన్న డిపాజిటర్లందరికీ వారి డబ్బును తిరిగి చెల్లించేందుకు సరిపడా నగదు నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. బ్యాంకు కార్యకలాపాలు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉండటం, యాజమాన్యం తీరు ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండటం, లైసెన్స్ షరతులను ఉల్లంఘించడం వంటి కారణాలతో లైసెన్సును రద్దు చేసినట్లు ఆర్బీఐ వివరించింది. గతంలో 2022 మార్చి నుంచి కొత్త కస్టమర్ల చేరికపై, 2024 జనవరి నుంచి డిపాజిట్లు, టాప్-అప్‌లపై ఆర్బీఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా పూర్తిస్థాయిలో లైసెన్సును రద్దు చేస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది.



## హైదరాబాద్లో రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు

హైదరాబాద్ : హైదరాబాద్ లో ఆటో డ్రైవర్లు సమ్మెకు దిగారు. ఎంజే మార్కెట్ చౌరస్తాలో ఆటో డ్రైవర్ల నిరసన ట్రాఫిక్ జామ్ కు దారి తీసిరంది. ఒక ఆటో డ్రైవర్ డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసాడు. ఆటో మీటర్పై ఛార్జీలు పెంచడంతోపాటు.. జిల్లా ఆటోలను హైదరాబాద్లోకి పర్మిషన్ ఇవ్వొద్దంటూ నిరసనకు దిగారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసారు. దాదాపు రెండగంటల సేపు ధర్నా కొనసాగింది.




# జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం

**- ఎన్.యు.జె. (ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాల పిలుపు**

**- హైదరాబాద్ వేదికగా రెండ్రోజుల సదస్సు విజయవంతం**

**'తెలంగాణ రైజింగ్' పై జాతీయ ప్రతినిధులకు వివరణ**



హైదరాబాద్( వాయిస్ టుడే ) ఏప్రిల్ 25: దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వారి సంక్షేమమే ధ్యేయంగా నేషనల్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. సంస్థ జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ రెండ్రోజుల సదస్సులో జర్నలిస్టుల భద్రత, హక్కుల సాధనపై కీలక తీర్మానాలు చేశారు.

**శ్రామిక జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం**

-- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి.

సమావేశాల మొదటి రోజు కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర కార్మిక సంక్షేమ, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ గమనాన్ని నిర్దేశించే జర్నలిస్టులను కూడా కార్మిక సంక్షేమ పరిధిలోకి తీసుకువచ్చి, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఆరోగ్య బీమా వంటి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

రెండవ రోజుల: ప్రజాస్వామ్య రక్షణలో జర్నలిస్టుల పాత్ర– ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

రెండవ రోజు సమావేశాలకు తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమనికి శ్రీకారం చుట్టారు. పాలకులకు, ప్రజలకు మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టుల పాత్రను ఆయన కొనియాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో పోరాడాల్సిన అవసరం ఉందని, అందుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు.

తెలంగాణ రైజింగ్: అభివృద్ధి పథంలో నవ రాష్ట్రం

ఈ సమావేశాలలో ప్రధాన ఆకర్షణగా "తెలంగాణ రైజింగ్" అంశం నిలిచింది. ఈ సెషన్‌లో హాజరైన ప్రభుత్వ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన జాతీయ స్థాయి జర్నలిస్టులకు తెలంగాణ అభివృద్ధి నమూనాను సమగ్రంగా వివరించారు.

**కీలక తీర్మానాలు**

సమాస్థ జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ మాట్లాడుతూ.. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు 'జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతన బోర్డుల ఏర్పాటు, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు గుర్తింపు వంటి అంశాలపై తీర్మానాలు ఆమోదించారు.

హైదరాబాద్ ఆతిథ్యం, తెలంగాణ అభివృద్ధిని చూసి జాతీయ ప్రతినిధులు అబ్బురపడ్డారు. ఈ సమావేశం జర్నలిస్టుల ఐక్యతకు కొత్త శక్తిని ఇచ్చిందని సురేష్ శర్మ అన్నారు. ఈ రెండు రోజుల సదస్సు తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని నేతృత్వంలో జరుగగా సంస్థ ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ కార్యక్రమన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రా పార్టీనిధులు హాజరయ్యారు. కాగా ఈ కార్యక్రమాలలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనూమాండ్ల ఝాన్సీ, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు ఆయూబ్, డెమాక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు వివేక్, సామాజిక వేత్త కరాటే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## నెక్లెస్ రోడ్‌లో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం

**హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బోయిన్పల్లి నుండి భారీగా తరలి వెళ్లిన ర్యాలీ**

కంటోన్మెంట్ ఏప్రిల్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి) : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుటకు ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,నిరుడు అశోక్ కుమార్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షులు సర్వేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రగ్స్ పై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి బోయిన్ పల్లిలోని రాష్ట్ర కార్యాలయం నుండి అశోక్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో హ్యూమన్ రైట్స్ మహిళా సభ్యులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా నెక్లెస్ రోడ్డుకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నిరుడు అశోక్ కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ... యువత డ్రగ్స్ గంజాయికి అలవాటు పడి వారి జీవితాలను వారే నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. పిల్లలు ఏం చేస్తున్నారు, వారి ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గ్రహిస్తూ వారిని సరైన మార్గంలో నడిపించుటకు చొరవ తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్, గాంజా, గుట్కాలకు యువత బానిసలు కావద్దని, ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోమతి నేషన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ గోమాతి, కంటోన్మెంట్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్ సురేఖ, గ్రేటర్ హైదరాబాద్ ఉమెన్ వింగ్ జనరల్ సెక్రెటరీ బొడ్డు వాసంతి, సభ్యులు ఆశ, హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లింగంపల్లి, మదర్సాలో ఆర్‌పీఎఫ్ భద్రత అవగాహన కార్యక్రమం



శేరిలింగంపల్లి, ఏప్రిల్ 25 (వాయిస్ టుడే): రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) లింగంపల్లి పోస్టు ఆధ్వర్యంలో శనివారం లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని మదర్సాలో భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ , రైల్వే రక్షణ దళం, సికింద్రాబాద్ సూచనలతో చేపట్టబడింది. సబ్ ఇన్‌స్పెక్టర్లు బి. బాలాజీ మరియు ఎస్.వి. బాషా నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో రైల్వే భద్రతపై అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వ్యాస రచన పోటీ నిర్వహించగా, సుమారు 60 నుండి 70 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అలాగే పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహకంగా పెన్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రైల్వే భద్రతా నియమాలు పాటించడం యొక్క ప్రాముఖ్యత, రైల్వే ఆస్తి సంరక్షణ అవసరం, ప్రయాణికుల ప్రవర్తనకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు గురించి వివరించారు. యువతలో బాధ్యతా భావం మరియు అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిలిచింది. విద్యార్థులు ఈ కార్యక్రమం ఉత్సాహంగా పాల్గొనడంతో విజయవంతంగా ముగిసింది.

## జూలైలో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం

**యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్**

**మైసూరు మహారాజుతో డా.ర్యాగ అరుణ్ కుమార్ చర్చలు**




హైదరాబాద్ : ఏప్రిల్ 25;( వాయిస్ టూ డే): బీసీలకు రాజ్యాధికారంలో జనాభా ప్రకారం వాటాగా జరిగే పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తామని మైసూరు మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్ స్పష్టం చేశారు. నేడు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ర్యాగ అరుణ్ కుమార్ నాయకత్వంలో బీసీల సమస్యలపై మైసూర్ లోని పార్లమెంట్ సభ్యులు కార్యాలయం నందు చర్చలు జరపడం జరిగింది. బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని న్యాయం చేకూర్చడానికి జూలైలో ఢిల్లీలో జరిగే అఖిల భారత ఓబీసీ మహాసభకు హాజరవుతానని యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్ హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ బీసీల పక్షాన ఉన్నారు. ఆయన హయంలోనే బీసీలకు న్యాయం న్యాయం జరగాలి. ఇక ఏ పార్టీ హయంలో కూడా బీసీలకు న్యాయం జరగదని అన్నారు. బీసీల డిమాండ్లను ప్రధాన మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లామని తెలిపారు. ఢిల్లీలో జరిగే మహాసభకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వేలాది మంది రానున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు హాజరవుతారన్నారు. అనంతరం ఆర్గానిక్ మామిడికాయలను మైసూర్ మహారాజుకు డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ అందజేశారు.

## టీ - సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, ఏప్రిల్ 25: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్న టీ–సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీ సేవ సెంటర్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు, కరెక్షన్, విమాన, బస్సు, ట్రైన్ టికెట్ల బుకింగ్స్, బ్యాంక్ మనీ ట్రాన్స్ ఫర్ వంటి 100కు పైగా ప్రభుత్వ పరీక్షలకు వెయ్యికి పైగా ఉపాధి అవకాశాలున్న స్కిల్ డెవలప్ మెంట్ కోర్సుల్లో అన్ లైన్ శిక్షణ సేవలను అందించడం ద్వారా ఉపాధి పొందవచ్చు నని ఆయన పేర్కొన్నారు. అసక్తిగల అభ్యర్థులు మే 5లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. క్రొత్త పాన్ కార్డులు అప్లై, కరెక్షన్ చేయవచ్చు, బస్సు, ట్రైన్, విమాన టికెట్స్ బుకింగ్స్, బ్యాంకు మనీ ట్రాన్స్ ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు, కాష్ డిపోసిట్స్, హెల్త్, బైక్, కార్ ఇన్సూరెన్స్, బిల్లుల చెల్లింపులు, 1000 కి పైగా కేంద్రప్రభుత్వ సంస్థ ఆమోదిత స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణా తరగతుల కు నమోదు కేంద్రం , 500 కి పైగా కేంద్రప్రభుత్వ సంస్థ ఆమోదిత స్కిల్ టెస్ట్ సర్టిఫికేషన్ కొరకు నమోదు కేంద్రం, 100 కి పైగా ప్రభుత్వ పరీక్షలకు మాక్ టెస్ట్ లకు నమోదు కేంద్రం, టీ - సేవ ప్రతి సంవత్సరం టీ - సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల ద్వారా 15 లక్షలకు పైగా విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు 1000కి పైగా ఉపాధి అవకాశాలు గల స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించనుంది. ఆన్ లైన్ సేవలు వినియోగదారులకు అందించడంతో పాటు ఆన్ లైన్ లో వివిధ సేవలను అందించడం ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధి పొందే వీలుంది. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: ఝఝఝ.ంవఝుశీఅశ్రీఱఅవ.ఛీఎ ఫోన్: 8179955744 సంప్రదించాలని కోరారు.

## కులసర్వే రిపోర్టు ఆహ్వానించదగినది

**సమాజ్వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి యాదవ్**



హైదరాబాద్, ఏప్రిల్ 25: తెలంగాణ ప్రభుత్వం ప్రచురించిన కుల సర్వే రిపోర్టును సమాజ్ వాది పార్టీ ఆహ్వానిస్తోందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి యాదవ్ తెలిపారు. కుల సర్వే రిపోర్టు ఒక దిక్సూచిగా తోడ్పడుతుందని అన్నారు. పలు పార్టీలు, సంస్థలు వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే రిపోర్టు ఆహ్వానించదగినదని ఆయన పేర్కొన్నారు. శనివారం బర్కత్ పుర లో పార్టీ నేతలు మహ్మద్ మజీరుల్లా బేగ్, మహ్మద్ రిజ్వాన్ హుస్సేన్, మహ్మద్ వజీద్ సిద్దికిలతో కలిసి ఆయన మాట్లాడుతూ... కులగణన, కుల సర్వే దేశ స్థాయిలో కాకున్నా, రాష్ట్ర స్థాయిలో సాధ్యమైనందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. సరైన వాస్తవ ప్రాతిపదికపై విశ్లేషణ జరిపినప్పుడు సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించడంలో ఈ కుల సర్వే రిపోర్టు తోడ్పడుతుందన్నారు. ఎన్నో కులాలలు విద్యకు, అభివృద్ధికి నేటికీ నోచుకోలేని స్థితి, కులం సామాజిక వెనుకబాటుకు గురి చేస్తున్నప్పుడు అన్ని రాజకీయ వర్గాలు మానవీయ కోణం నుండి ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. అసమానతలను తగ్గిస్తూ, అభివృద్ధి వైపు నడిపిస్తూ, సామాజిక మార్పుకు తోడ్పడడమే రాజ్యాంగ, ప్రజాస్వామిక లక్ష్యమని అన్నారు. తెలంగాణ కుల సర్వే రిపోర్టు మండల స్థాయి డేటాతో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## పాన్ బ్రోకర్లపై కీసర రెవిన్యూ ఇన్స్పెక్టర్ విచారణ

నాగారం, ఏప్రిల్ 25:–(వాయిస్ టుడే): కీసర మండలంలో పాన్ బ్రోకర్ల నిర్వహకాలపై కీసర తాసిల్దార్ కార్యాలయం రెవెన్యూ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్ శనివారం విచారణ చేపట్టారు, ఈ మేరకు కీసర తహసీల్దారు కార్యాలయం విచారణ విషయాలను వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆర్ఐ బాబా రాందేవ్ జ్యువెలర్స్ ు పాన్ బ్రోకర్ పై వచ్చిన ఫిర్యాదును పరిశీలించేందుకు సంఘటన స్థలానికి వెళ్లారు. ఈ సందర్భంగా బాధితురాలు సంతోషిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశీలన సమయంలో మాజీ వార్డ్ కౌన్సిలర్ పంగ హరిబాబు కూడా హాజరయ్యారని తెలిపారు. తాము చేపట్టిన విచారణలో బాబా రాందేవ్ జ్యువెలర్స్‌లో తాకట్టు పుస్తకాలను పరిశీలించగా, పలు కీలక లోపాలు గుర్తించబడ్డాయని తెలిపారు. ముఖ్యంగా వడ్డీ రేటు నమోదు చేయకపోవడం, బంగారం యొక్క ప్యూరిటీ (నాణ్యత) వివరాలు నమోదు చేయకపోవడం, గ్రాస్ వెయిట్, నెట్ వెయిట్ వివరాలు నమోదు చేయకపోవడం, ప్రస్తుత మార్కెట్ విలువ నమోదు చేయకపోవడం, అలాగే పాన్ టికెట్ వెనుక భాగంలో అవసరమైన సంతకాలు లేకపోవడం మరియు టర్మ్స్ అండ్ కండిషన్స్ తప్పుగా నమోదు చేయబడినట్లు గుర్తించనట్లు తెలిపారు. తాము పరిశీలిస్తున్న సమయంలో బాబా రాందేవ్ జ్యువెలరీ యజమాన్యం అందుబాటులో లేకపోవడంతో తదుపరి విచారణను వచ్చే నెల 2వ తేదీన కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పంగ హరిబాబు రెవెన్యూ ఇన్స్పెక్టర్‌తో మాట్లాడి, ఈ వ్యవహారంపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత లైసెన్సును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, తాకట్టు పెట్టబడిన నగలు చట్ట విరుద్ధంగా ఉన్నందున, బాధితులందరికీ సమాచారం ఇచ్చి, ఎలాంటి వడ్డీ లేకుండా వారి నగలను తిరిగి ఇవ్వాలని ఆయన కోరారు.



## రాష్ట్ర ప్రోటోకాల్ నేతలుగా బాధ్యతలు స్వీకరించిన హెచ్ గోపాల్ రావు, బొంగునూరి కిషోర్ రెడ్డి

**బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు**

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 25(వాయిస్ టుడే) : నూతనంగా నియమితులైన రాష్ట్ర ప్రోటోకాల్ చైర్మన్ హెచ్ గోపాల్ రావు మరియు రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేటర్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి తెలంగాణ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.



## ఎమ్మెల్యే జిఎంఆర్ ను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి

పటాన్చెరు: ఇటీవల తన కార్యాలయంలో జారిపడి, స్వల్ప గాయాలకు గురై తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ని శనివారం సాయంత్రం మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తన సహచర ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్ లతో కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ... పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం తపనపడే ఎమ్మెల్యే జిఎంఆర్ గారు త్వరగా కోలుకొని.. ప్రజా సేవలోకి రావాలని ఆయన ఆక్షాక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, పాండురంగా రెడ్డి, విజయ్ కుమార్, అంజయ్య, శ్రీకాంత్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సుప్రజా వెంకట్ రెడ్డి. గూడెం మధుసూదన్ రెడ్డి, పరమేష్ యాదవ్, అంతిరెడ్డి పాల్గొన్నారు.



## స్వయం సహాయక బృందాలకు 2 కోట్ల చెక్కుల పంపిణీ

### – 99 రోజుల కార్యాచరణలో కీలక అడుగు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 25(వాయిస్ టుడే ) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 51 వ రోజు స్వయం సహాయక బృందాల–బ్యాంకు అనుసంధాన కార్యక్రమం (ఎస్ హెచ్ జి– బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాము ) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని జీడిమెట్ల సర్కిల్ 55, కుత్బుల్లాపూర్ జోన్, సి.ఎం.సి పరిధిలో స్వయం సహాయక బృందాలకు చెక్కులను పంపిణీ చేయడం జరిగినది. 284– గణేశ్ నగర్ – (4) గ్రూప్స్ కు 80.00 లక్ష , 285–పద్మ నగర్ – (2) గ్రూప్స్ కు 40.00 లక్ష , 286–కుత్బుల్లాపూర్ –(3) గ్రూప్స్ కు 60.00 లక్ష మరియు 287– పేట్ బషీరాబాద్– (1) గ్రూప్స్ కు 20.00 ఝునెప్త్రం మొత్తం 2.00 కోట్లు పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమం లో పింకేష్ కుమార్, ఐఏఎస్ , కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ,డి శంకర్ సింగ్ డెప్యూటీ కమిషనర్, జీడిమెట్ల సర్కిల్–55, కుమారి లావణ్య, , డెప్యూటీ కమిషనర్, చింతల్ సర్కిల్–54 , ఇంద్రసేన, ప్రాజెక్టు ఆఫీసర్ , జీడిమెట్ల సర్కిల్–55 మరియు యూసీడి సిబ్బంది పాల్గొనడం జరిగినది.



## ఆధ్యాత్మిక భోధనలు, ధర్మమార్గం, సేవ చూపిన గొప్ప గురువు వీర బ్రహ్మేంద్ర స్వామి

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 25(వాయిస్ టుడే ): 129 – సూరారం డివిజన్ న్యూ శివాలయ నగర్ లోని శ్రీశ్రీశ్రీ జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ 35వ ఆరాధన బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిధిగా హాజరై వీర బ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఆధ్యాత్మిక భోధనలు, ధర్మమార్గం, సేవ చూపిన గొప్ప గురువు వీర బ్రహ్మేంద్ర స్వామి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిహెచ్.నర్సింహా రెడ్డి, డి. రాజలింగం, ఎన్. వెంకటేష్ గౌడ్, డి. కృష్ణ, వసంత్, శ్రీధర్, సునీల్ గౌడ్, ప్రభాకర్, రవి కుమార్, విఠల్ గైక్వాడ్, మెకానిక్ ప్రేమ్, డి. బాబురావు, తేజ, మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎండి. సిద్దిక్, సీనియర్ నాయకులు వారాల వినోద్, శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల శ్రీను, డేవిడ్, కిరణ్, లక్ష్మణ్, శేఖర్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉషోదయ కాలనీ పార్క్ అభివృద్ధి - ఒక విజయం!

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 25(వాయిస్ టుడే ): మన కాలనీ మెయిన్ పార్కు అభివృద్ధి కోసం గత రెండేళ్లుగా మనం చేస్తున్న ప్రయత్నాలు ప్రభుత్వ స్థాయిలో ఇంకా ప్రాసెసింగ్ లోనే ఉన్నాయి. అయితే, ప్రస్తుత వేసవి సెలవుల్లో మన పిల్లలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో, మన కాలనీ ప్రెసిడెంట్ సతీష్ బాబు చొరవ తీసుకుని స్పాన్సర్‌షిప్ మరియు సిఎస్ఆర్ యాక్టివిటీ ద్వారా పార్కును సిద్ధం చేయడం హర్షణీయం.

**ఈ అభివృద్ధిలో పాలుపంచుకున్న దాతలకు ధన్యవాదాలు:**

వైష్ణవి గ్రానైట్స్: పార్కులో దెబ్బతిన్న చోట కొత్త గ్రానైట్ రాళ్లను వేయించడానికి ముందుకు వచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

వాకింగ్ టీమ్ (శ్రీనివాస్ గౌడ్ , కడప రమేష్ బృందం): పార్క్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కోసం స్పాన్సర్‌షిప్ అందించి తమ వంతు సహకారాన్ని అందించారు.

ప్రస్తుతం జరిగిన/జరుగుతున్న పనులు: ఇసుక: పార్కు మధ్యలో ఖాళీ అయిన చోట ఒక పెద్ద లారీ ఇసుకను పోయించడం జరిగింది.

గ్రీనరీ: కొత్త మొక్కలు నాటడం మరియు గడ్డి (గ్రాస్సింగ్ ) వేయడం ద్వారా పార్కును పచ్చదనంతో నింపారు.

పెయింటింగ్: ఇన్ఫ్రాస్ట్రక్చర్ మొత్తానికి కొత్త పెయింట్స్ వేసి సరికొత్త లుక్ తీసుకురాబోతున్నారు.

మిగిలిన పనులన్నీ త్వరలోనే పూర్తవుతాయి. కాలనీ క్షేమం కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

# తారానగర్ రోడ్డు విస్తరణపై ప్రభుత్వానికి లేఖ రాస్తానన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 25 (వాయిస్ టుడే): తారానగర్‌లో ప్రతిపాదిత రోడ్డు విస్తరణ అంశంపై ప్రభుత్వానికి లేఖ రాస్తానని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని తారానగర్‌లో ఆయన, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి మరియు శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్‌తో కలిసి తారానగర్ మార్కెట్ యాజమాన్యానికి జారీ చేసిన నోటీసులను పరిశీలించి, వ్యాపారులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తారానగర్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మరియు రవికుమార్ యాదవ్‌ను కలిసి, పోచమ్మ గుడి నుంచి హనుమాన్ గుడి వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టే ప్రతిపాదన వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. సుల్తాన్ బజార్, బేగం బజార్‌ల మాదిరిగానే తారానగర్ మార్కెట్ కూడా మూడు తరాలుగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రతిపాదిత 100 అడుగుల రోడ్డు విస్తరణతో చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు, నివాసితులు, ఉద్యోగులు వంటి వేలాది కుటుంబాల జీవనంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణను 100 అడుగుల బదులు 60 అడుగులకు పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టదలచిన రోడ్డు విస్తరణ వల్ల స్థానిక వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే వ్యాపారం చేస్తూ జీవిస్తున్న వారి ఉపాధిని దెబ్బతీయడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనపై పునరాలోచించి, వ్యాపారులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికుల సమస్యలను బీజేపీ తరఫున తాను ముందుండి పోరాడుతానని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సమస్యపై ప్రభుత్వానికి లేఖ రాసి వ్యాపారులకు జరుగుతున్న అన్యాయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వ్యాపారులు ధైర్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, దినేష్ బోరా, గోవింద్, అశ్విన్ జోషి, రామ్ సుఖ్, రామ్ నివాస్, బచ్చు శ్రీనివాస్, మంగీలాల్, సత్యనారాయణ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి ఫ్యాక్కో చొరవ

### -- టీఎస్ఎస్ పీడీసీల్ సీఎండీ జి వి పాటిల్ సానుకూల హామీ

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 25(వాయిస్ టుడే ): తెలంగాణ కేబుల్ మరియు ఇంటర్నెట్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాక్కో (ఎఫ్ ఎ సి ఓ )– ఫెడరేషన్ అఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ ) ప్రతినిధులు తీసుకున్న ఈ చొరవ చాలా అభినందనీయం. టీఎస్ఎస్పీడీసీఎల్ (టీఎస్ఎస్ పీడీసీల్ ) కొత్త సీఎండీ , జి వి పాటిల్ కలిసి, క్షేత్రస్థాయిలో ఆపరేటర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించడం ఒక సానుకూల పరిణామం. ఈ సమావేశానికి సంబంధించిన ముఖ్య వివరాలు ఇక్కడ ఉన్నాయి:

**ప్రధాన అంశాలు:**

పాల్గొన్న ప్రతినిధులు: ఫ్యాక్కో ప్రెసిడెంట్ దేగల సతీష్ బాబు, జనరల్ సెక్రెటరీ అబ్దుల్ సలాం, మరియు ఆర్గనైజింగ్ సెక్రెటరీ షాబుద్దీన్.

ముఖ్య ఉద్దేశ్యం: విద్యుత్ స్తంభాల ద్వారా కేబుల్స్ వేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇతర సాంకేతిక మరియు పాలనాపరమైన సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లడం.

ప్రతినిధుల వివరణపై సీఎండీ సానుకూలంగా స్పందించారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడం ఆపరేటర్లకు పెద్ద ఊరట.

**ఆపరేటర్లు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు (అంచనా):**

సాధారణంగా ఏరియల్ కేబుల్ ఆపరేటర్లు ఈ క్రింది అంశాలపై చర్చించే అవకాశం ఉంటుంది:

పోల్ టాక్స్ (పోలె టాక్స్ ): స్తంభాల వినియోగానికి సంబంధించిన అద్దె లేదా పన్నుల సరళీకరణ. వైర్ల తొలగింపు: విద్యుత్ శాఖ సిబ్బంది ముందస్తు సమాచారం లేకుండా కేబుల్స్ కట్ చేయడం వల్ల కలిగే నష్టం. అనుమతుల ప్రక్రియ: కొత్త కనెక్షన్లు లేదా లైన్ల విస్తరణ కోసం సింగిల్ విండో అనుమతులు. ముఖ్య గమనిక: ప్రభుత్వం మరియు అధికారులతో ఇలాంటి చర్చలు జరపడం వల్ల వేలాది మంది కేబుల్ ఆపరేటర్ల జీవనోపాధి మెరుగుపడటమే కాకుండా, వినియోగదారులకు అంతరాయం లేని ఇంటర్నెట్ మరియు కేబుల్ సేవలు అందుతాయి.

## గాజులరామారం సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాక సమావేశంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 25(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం, మహాదేవపురం, షాపూర్ నగర్, మరియు సురారం డివిజన్లు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ నివాసంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ ఈ కార్యక్రమానికి విచ్చేసిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఆరు గ్యారెంటీలో ముఖ్యమైన రేషన్ కార్డులు, మరియు పేదలకు సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, మరియు ఇందిరమ్మ ఇండ్లు ఇతర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని తెలిపారు అదేవిధంగా రాబోవు గ్రేటర్ మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అన్ని డివిజన్లో కాంగ్రెస్ ముఖ్య నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు బలంగా పనిచేసే వారికి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం దక్కుతుందని నాయకులను ఉద్దేశించి మాట్లాడారు..ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు గాజులరామారం సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# లింగంపల్లి గ్రామంలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 25 (వాయిస్ టుడే): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి గ్రామంలో శ్రీ నాభిశీల (బొడ్రాయి) ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ పిఏసి చైర్మన్ శ్రీ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని, సీనియర్ నాయకుడు మారబోయిన రాజు యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ, తెలంగాణ ప్రాంతంలోని ప్రతి గ్రామంలో బొడ్రాయిని పూజించే సంప్రదాయం పూర్వీకుల నుంచి కొనసాగుతోందన్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ఎలాంటి అపశ్రుతులు జరగకుండా ఉండాలని మన పెద్దలు బొడ్రాయిని ప్రతిష్ఠించే వారు అని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

ఆపద సమయాల్లో గ్రామ దేవతలే తమను కాపాడతాయని పల్లె ప్రజలు విశ్వసిస్తారని, అమ్మవార్లకు ప్రతీకగా ఊరి మధ్యలో బొడ్రాయిని ప్రతిష్ఠించి ప్రతి సంవత్సరం పూజలు, జాతరలు నిర్వహించడం ఆనవాయితీగా ఉందన్నారు. ఆ సమయంలో కులమతాలకు అతీతంగా గ్రామమంతా ఏకమై ఉత్సవాలు జరుపుకోవడం విశేషమన్నారు. గ్రామం



నడిమధ్యలో నిలువుగా నాటిన రాయినే బొడ్రాయి (బొడ్డురాయి)గా పిలుస్తారని వివరించారు. గ్రామ నిర్మాణ సమయంలో పొలిమేరలను నిర్ణయించి, ఆ వైశాల్యానికి మధ్యభాగంలో ఈ రాయిని ప్రతిష్ఠిస్తారని చెప్పారు. మానవ శరీరంలోని నాభిలా గ్రామానికి ఇది కేంద్ర బిందువుగా ఉండటంతో దీనికి ‘బొడ్డురాయి’ అనే పేరు వచ్చిందన్నారు. బొడ్రాయి నిర్మాణంలో మూడు భాగాలు ఉంటాయని, కింది భాగాన్ని బ్రహ్మ స్వరూపంగా నాలుగు పలకలుగా, మధ్య భాగాన్ని విష్ణు స్వరూపంగా ఎనిమిది పలకలతో, పైభాగాన్ని శివ స్వరూపంగా లింగాకారంలో చెక్కుతారని తెలిపారు. బొడ్రాయి ప్రతిష్ఠకు ముందుగా శీతలాదేవి అమ్మవారి యంత్రాన్ని, అలాగే దిక్కుల వారీగా సర్వతోభద్ర యంత్రాలను ప్రతిష్ఠించడం శాస్త్రోక్త పద్ధతిలో జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, అక్తర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చింతకింది రవీందర్ గౌడ్, రవి యాదవ్, మల్లేష్ యాదవ్, మల్లేష్ గౌడ్, పవన్ తదితరులు, గ్రామ ప్రజలు మరియు భక్తులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు సమరోత్సాహంతో పని చేయాలి: నీలం మధు ముదిరాజ్

## సిద్దిపేట క్యాంపు ఆఫీస్‌లో కాంగ్రెస్ సన్నాహక సమావేశం

## పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నీలం



పటాన్ చెరు (వాయిస్ టుడే) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించి, జిల్లాలోని అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో జయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీల అమలు తీరును క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. గత పదేళ్ల పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగిస్తూ, నేడు ఇందిరమ్మ రాజ్యం పేదవాడి ఇంటికి సంక్షేమం అభివృద్ధి జరిగేట్లుగా పాలన కొనసాగిస్తున్నామన్నారు. రుణమాఫీ మొదలుకొని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి పథకాలు ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని పెంచాయని ఇదే ఉత్సాహంతో ఎన్నికల బరిలోకి దిగాలని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న సిద్దిపేటలో మళ్ళీ పార్టీ జెండాను రెపరెపలాడించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆయన గుర్తు చేశారు. కార్యకర్తలే పార్టీకి అసలైన పట్టుకొమ్మలని, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల్లో గెలుపు ద్వారానే గ్రామీణ స్థాయి వరకు అభివృద్ధిని మరింత వేగవంతం చేయవచ్చని, అందుకే ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో గ్రూపు విభేదాలకు తావు లేకుండా, అందరూ ఒకే తాటిపై నడవాలని నీలం మధు పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపికలో కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేసేలా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరాలని, మెదక్ పార్లమెంట్ పరిధిలో క్లీన్ స్వీప్ చేయడమే మన లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు, అనంతరం సిద్ధిపేట టౌన్ లోని శ్రీ పెద్దమ్మ దేవాలయంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించి దర్శించుకోవడం జరిగింది, అలాగే స్థానిక కాంగ్రెస్ నాయకులు చెంది శ్రీనివాస్ మరియు ఇబ్రహీం షా నివాసాలలో తేనేటి విందులో పాల్గొన్నాను.. ఈ కార్యక్రమాలలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు భూధం లక్ష్మీ, మండల అధ్యక్షులు బిక్షపతి, బ్రహ్మ రామచందర్, కౌన్సిలర్స్ ఎల్లమ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు నారాయణ, కలియుద్దీన్, దాస్ అంజన్న, మార్క్ సతీష్ గౌడ్, పెద్దన ఆలయ గౌరవ అధ్యక్షులు చింతమడక రాజయ్య, గుడి చైర్మన్ నాయిని శేఖర్, నిర్వాహకులు గడిల శ్రీనివాస్, సత్య నారాయణ, గుర్రాల శ్రీహరి, చాంది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎన్ ఎం ఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్

### యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులను పూర్తిచేసిన కార్పొరేటర్ బన్నాల గీతాను అభినందించిన బీరప్ప గడ్డ బస్తీవాసులు,

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- బీరప్ప గడ్డ తేనె లక్ష్మీనరసింహా ఆలయం నుండి బ్యాంక్ కాలనీ పార్క్ వరకు సుమారు లక్షల 36 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, శనివారంరోజు ఉదయం 5 గంటల నుండి రోడ్డు పనులను ప్రారంభమయ్యాయి, కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి అధికారులు రోడ్డు నిర్మాణ సమయంలో కచ్చితంగా పనులను పర్యవేక్షించాలని, కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు పనులు జరిగే సమయంలో ప్రజలకు కూడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని, ఈనెల 30 తారీఖున తేనె లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం ఉన్న నేపథ్యంలో కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు రోడ్డు పనులను కూడా యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులు చేపట్టామని అన్నారు, యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులను పూర్తిచేసిన కాంట్రాక్టర్ ని అభినందించిన కార్పొరేటర్ బన్నాల.కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొక్కొండ జగన్, ఏదుల్ల కొండల్ రెడ్డి, బింగి శ్రీనివాస్, గోవు ఆనంద్, ,ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఇంద్రసేనారెడ్డి , బాలకృష్ణ గౌడ్ ,శ్యామ్ ,బంటి గౌడ్, బీరప్ప గడ్డ బాలు, మైసలు, బొమాక్ శ్రీనివాస్, మొతుకుపల్లి రాజు , బస్తీ మహిళలు మొదలగువారు పాల్గొన్నారు.

## శ్రీ మహంకాళి రామ్ మందిర్ దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం

### - హాజరైన మందుముల పరమేశ్వర్ రెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 1 లోని శ్రీ మహంకాళి రామ మందిర్ దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ గా బాబు రావు, సభ్యులుగా విపిన్ అగర్వాల్ ,రఘు సింగమనేని , మల్లాది రమాకాంత్ రెడ్డి ,అమర వాణి మేక , పెద్దోళ్ల విజయలక్ష్మి, రామేశ్వరం ధర్మరాజు,ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ప్రణీత్ ,ఈఓ వెంకన్న ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగి రెడ్డి ,బొపన్నపల్లి సుధాకర్ రెడ్డి ,డివిజన్ అధ్యక్షులు విజయ్ ,కంది శ్రవణ్ రెడ్డి , గణేష్ నాయక్, రమేష్ నాయక్, మురళి ముదిరాజ్,విసు , సాగ శ్రీధర్, గంగ, వాసు నాయక్, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# వరకట్నం నిషేధం.. బాల్య వివాహ నిషేధాన్ని కఠినంగా అమలు చేయటానికి.. పోలీసులు సహకరించాలి

### - యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు




(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు వారి సూచనల మేరకు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి. ముక్తిదా కోర్టు ఆవరణలో బాల్య వివాహాలు, వరకట్న నిషేధం, పోక్సో చట్టం, బాధితులకు అందచేస్తున్న నష్ట పరిహారం, సంబంధిత శాఖల సమన్వయం, న్యాయ సహాయం మొదలగు అంశాలపై అవగాహన, సమీక్ష సదస్సును నిర్వహించారు.ఈ సందర్బంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వరకట్న దురాచారాన్ని రూపుమాపటానికి గౌరవ సుప్రీం కోర్టు వారు తగిన సూచనలు చేశారని ఈ సూచనల ప్రకారం వరకట్న నిషేధంపై అన్ని వర్గాల వారికి న్యాయ విజ్ఞాన సదస్సులు, కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు, ఫీల్డు స్థాయిలో ఉన్నవారికి తగిన శిక్షణలు ఇవ్వాలని ముఖ్యంగా జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ బాల్య వివాహ నిషేధానికై అవగాహన, మద్దతు, సహాయం, చర్యలు అంశాలతో జాతీయ పథకాన్ని రూపొందించిందని ఈ పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేయటానికి చైల్డ్ లైన్, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సంక్షేమ శాఖ, పోలీసు శాఖలు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు సహకరిస్తూ బాల్య వివాహ నిషేధన్ని కఠినంగా అమలు చేయటానికి ప్రభావవంతమైన కార్యాక్రమాలు చేయాలని తెలిపి, పోక్సో కేసుల పరిష్కారానికి, బాధితుల రక్షణ, పునరావాసం, నష్ట పరిహారం అందచేయటం అంశాలపై పోలీసు వారు, సంక్షేమ శాఖలు, చైల్డ్ లైన్ సమన్వయంతో చట్ట అమలుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, ఇంచార్జి కార్యదర్శి యం. ఉషశ్రీ, జువెనైల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి జి. స్వాతిలు మహిళలపై మరియు పిల్లలపై జరుగు హింసను ధైర్యంగా ఎదుర్కొనటానికి వారికి ఇవ్వాల్సిన చైతన్యం, అవగాహన, తీసుకోవాల్సిన చర్యలు, సంబంధిత చట్టాలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సి. డబ్ల్యు. సి చైర్మన్ జయశ్రీ, సభ్యులు రుద్రమదేవి, శివరాజు, మల్లేష్,జిల్లా డిప్యూటీ సూపరింటెండెంట్ పోలీసు అధికారులు రవీందర్, శ్రీనివాస్ నాయుడు, పి.మధుసూదన్ రెడ్డి , జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. కేశవ రెడ్డి, జిల్లా బాలల సంక్షేమ అధికారిని అనంత లక్ష్మి, సఖి కేంద్రం సెంట్రల్ అడ్మిన్ వినీల, సార్ప్ ఎన్ జి ఒ డా. ప్రమీల, న్యాయ సహాయ న్యాయవాదులు, భువనగిరి సిడిపిఒ శైలజ, ప్యానల్ లాయర్లు, మహిళా సాధికారత శాఖ జిల్లా సమన్వయకర్త హర్ష, పారా లీగల్ వాలంటీర్లు సదస్సులో పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో ఎం.కిషోర్ కు పీహెచ్.డీ



పటాన్ చెరు (వాయిస్ టుడే) : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఎం. కిషోర్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'పెరోవ్ స్కైట్ సౌర సెల్స్ కోసం బెంజోళి1,2-ఎ:4,5-ఎ'రిడైథయోఫేన్ ఆధారిత నూతన రంధ్ర వాహక పదార్థాలు: సంశ్లేషణ, వర్గీకరణ, అనువర్తనాల'పై ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

పునరుత్పాదక శక్తి రంగంలో అభివృద్ధి చెందుతున్న, ఆశాజనకమైన సాంకేతికత అయిన పెరోవ్ స్కైట్ సోలార్ సెల్స్ కోసం అధునాతన రంధ్ర వాహక పదార్థాల (హెచ్‌టీఎం) రూపకల్పన, అభివృద్ధిపై ఈ పరిశోధన కేంద్రీకృతమైందని తెలియజేశారు. నవీనమైన బెంజళి1,2-ఎ:4,5-ఎఃరిడైథయోఫేన్ ఆధారిత సేంద్రియ పదార్థాలను సంశ్లేషించడం ద్వారా, సౌర సెల్స్ పనితీరులో సామర్థ్యం, స్థిరత్వానికి సంబంధించిన కీలక సవాళ్లను ఆయన పరిష్కరించారన్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన రంధ్ర వాహక పదార్థాలు అద్భుతమైన ఉష్ణ స్థిరత్వాన్ని సమర్థవంతమైన ఆవేశ రవాణాను, అనుకూలమైన శక్తి అమరికను ప్రదర్శిస్తాయని ఈ అధ్యయనం నిరూపించినట్టు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఈ పదార్థాలను వినియోగించుకున్న డోపెంట్-రహిత పెరోవ్ స్కైట్ సౌర సెల్స్, మెరుగైన కార్యాచరణ స్థిరత్వంతో పాటు, 21.14 శాతం వరకు విద్యుత్ మార్పిడి సామర్థ్యాన్ని సాధించాయని తెలిపారు. తక్కువ ఖర్చుతో కూడిన, అధిక పనితీరు గల సౌర సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో, సుస్థిర ఇంధన పరిష్కారాలకు దోహదపడటంలో, వినూత్న అణు రూపకల్పన యొక్క సామర్థ్యాన్ని ఈ పరిశోధన నొక్కి చెప్పిందన్నారు. డాక్టర్ కిషోర్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావును కలిసిన బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ లో రెండవసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భువనగిరి చెందిన పడమటి జగన్మోహన్ రెడ్డిని నియమించినందులకు గాను శనివారం రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎం. రామచంద్ర రావుని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో నా సహచర ప్రధాన కార్యదర్శి దేవర శ్రీనివాసు, జాతీయ కిసాన్ మోర్చా నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి , అశోక్ రెడ్డి , రాష్ట్ర కిసాన్ మోర్చా పదాధికారులు పాల్గొన్నారు.



## చంచల్‌గూడా జైల్లో న్యాయ అవగాహన జ్వాల

### జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి పి. అరుణ కుమారి ప్రత్యేక సందర్శన

హైదరాబాద్ ; ఏప్రిల్ 25(వాయిస్ టుడే): హైదరాబాద్‌లోని చంచల్‌గూడా పురుషుల మరియు మహిళల జైళ్లలో శనివారం ఒక కీలక కార్యక్రమం జరిగింది. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి పి. అరుణ కుమారి జైళ్లను సందర్శించి ఖైదీలకు న్యాయ అవగాహన కల్పించారు. ఈ సందర్శన ఖైదీలలో చట్టపరమైన హక్కులపై స్పష్టత పెంపొందించడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. ఖైదీలకు న్యాయంపై పూర్తి అవగాహన ఈ కార్యక్రమంలో ఖైదీలకు అనేక కీలక అంశాలపై వివరణాత్మకంగా వివరించారు:

ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి? అర్హతలు ఏమిటి?

బెయిల్ విధానం, కేసుల త్వరిత పరిష్కారం కోసం మార్గాలు

లోక్ అదాలత్ ద్వారా తక్కువ సమయంలో కేసుల పరిష్కారం

అండర్‌ట్రయల్ ఖైదీల హక్కులు మరియు చట్టపరమైన రక్షణలు

మహిళా ఖైదీలకు ప్రత్యేక హక్కులు, సంక్షేమ పథకాలు

బాలలతో ఉన్న మహిళా ఖైదీలకు అందుబాటులో ఉన్న సదుపాయాలు మానవ హక్కులు జైలులోనూ రక్షితం అరుణ కుమారి స్పష్టం చేశారు . "ఖైదీలు జైల్లో ఉన్నప్పటికీ వారి మానవ హక్కులు పూర్తిగా రక్షించబడతాయి" కుటుంబ సభ్యులతో సంబంధాలు కొనసాగించుకునే హక్కులు ఫిర్యాదు పరిష్కార వ్యవస్థపై అవగాహన కౌన్సెలింగ్ మరియు పునరావాస కార్యక్రమాలు విడుదల అనంతరం పునరావాస సహాయం ఆధునిక న్యాయ సేవలు ఖైదీలకు ఈ-కోర్ట్స్, లీగల్ ఎయిడ్ క్లినిక్స్, పరోల్ & రిమిషన్ విధానాలపై కూడా వివరించారు. టెక్నాలజీ సహాయంతో న్యాయం త్వరగా అందే మార్గాలను తెలియజేశారు. ఖైదీలతో ప్రత్యక్ష సంభాషణ సందర్శన సందర్భంగా అరుణ కుమారి ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి న్యాయ మరియు వ్యక్తిగత సమస్యలపై స్పందించి సరైన మార్గదర్శనం ఇచ్చారు.

ఖైదీలు కూడా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు."ప్రభుత్వం అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను ప్రతి ఖైదీ వినియోగించుకోవాలి" అని అరుణ కుమారి సూచించారు. ఈ కార్యక్రమం ఖైదీలలో న్యాయ అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎన్. శివకుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ కాళిదాస్, జైలర్లు విజయకుమార్, రామకృష్ణ రెడ్డి, మహిళా జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి రాజకీయాల్లో మంటలు... ఎమ్మెల్యేకు బండి రమేష్ బహిరంగ సవాల్

కూకట్‌పల్లి: ఏప్రిల్ 25(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం రోజురోజుకీ వేడెక్కుతోంది. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ బహిరంగ సవాల్ విసిరారు. “నీ 10 సంవత్సరాల పాలనలో కూకట్‌పల్లికి నువ్వు చేసింది శూన్యం” అంటూ ఆయన తీవ్రంగా మండిపడ్డారు. “90 శాతం అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్నావు... అయితే కూకట్‌పల్లిలో నువ్వు చేసిన ఒక గొప్ప ప్రాజెక్టును ప్రజల ముందు చూపించగలవా?” అంటూ సూటిగా ప్రశ్నించారు.



### ప్రధాన ఆరోపణలు

బండి రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పనితీరుపై పలు ఆరోపణలు చేశారు.

ఎన్నికల సమయంలో మాత్రమే చిరు వ్యాపారులపై ప్రేమ చూపుతున్నారని విమర్శించారు.

ఐడియల్ లేక్ వద్ద ఉన్న 40 మంది వ్యాపారులను బలవంతంగా తొలగించారని ఆరోపించారు.

ఐడిఎల్ ల్యాండ్ అన్యాక్రాంతమైందని, హానర్ హోమ్స్‌లో ఇల్లు ఎలా వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కూరగాయల మార్కెట్లు, దేవాలయాల నిర్వహణలో అనుచరులకు ప్రాధాన్యం ఇచ్చి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

ఫ్లైఓవర్లు, ప్రాజెక్టులపై క్రెడిట్ వివాదం

బాలానగర్, కేపీహెచ్‌బీ ఫ్లైఓవర్ల నిర్మాణంలో ఎమ్మెల్యే పాత్ర లేదని, ఇతర నాయకుల కృషి వల్లే అవి సాధ్యమయ్యాయని బండి రమేష్ స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూకట్‌పల్లిలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

మూసాపేట జంక్షన్ వద్ద రూ.170 కోట్లతో భారీ ఫ్లైఓవర్ నిర్మాణం

జేఎన్‌టీయూ వద్ద స్కైవాక్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి

100 పడకల ఆధునిక ఆసుపత్రి త్వరలో ప్రారంభం

కూకట్‌పల్లి డిగ్రీ కాలేజీ అభివృద్ధికి రూ.2.5 కోట్లు నిధులు

ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యా విస్తరణకు చర్యలు

హైడ్రా ఆధ్వర్యంలో 3300 గజాల్లో పార్క్ ఏర్పాటు

### ఎమ్మెల్యేపై బహిరంగ సవాల్

“కూకట్‌పల్లిలో అక్రమ నిర్మాణాలకు నీవే కారణం కాదా?

నీ భువనవిజయం బిల్డింగ్‌పై చర్యలు తీసుకోవడానికి సిద్ధమా?” అంటూ బండి రమేష్ ఘాటుగా సవాల్ విసిరారు.

అంతేకాదు, “మా కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే సహించము” అంటూ కఠిన హెచ్చరిక కూడా జారీ చేశారు.

### రాజకీయంగా కీలక సందేశం

ఈ ప్రెస్ మీట్ ద్వారా కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లిలో మరింత బలపడుతోందని, ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో పలు నియామకాలు జరిగాయని బండి రమేష్ వెల్లడించారు. “ప్రజలకు చేరువై సేవ చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం” అని ఆయన స్పష్టం చేశారు. మొత్తంగా, ఈ వ్యాఖ్యలు కూకట్‌పల్లి రాజకీయాల్లో కొత్త రాజకీయ వేడి రగిలించాయి. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ ఆరోపణలకు ఎలా ప్రతిస్పందిస్తారో అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



## హిందూ సంప్రదాయాలకు మద్దతుగా ఆంజనేయ నగర్‌లో అవగాహన కార్యక్రమం

### హిందూ సాంప్రదాయాల పట్ల ఉద్యోగులకు తమ విశ్వాసాలను గౌరవించుకునే హక్కు ఉండాలి

### మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్

కూకట్ పల్లి; ఏప్రిల్ 25(వాయిస్ టుడే) : హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి భారతీయుని బాధ్యతగా భావిస్తూ, ఇటీవల కొన్ని ప్రైవేట్ సంస్థలు తమ అంతర్గత విధానాల పేరుతో ఉద్యోగుల వ్యక్తిగత విశ్వాసాలను పరిమితం చేస్తున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలపై స్పందిస్తూ, ప్రముఖ కంటి కళ్లజోడు సంస్థ లెన్స్ యాజమాన్యం తీసుకున్న డ్రెస్ కోడ్ నిర్ణయాలను ఖండిస్తూ, నేడు ఆంజనేయ నగర్ చౌరస్తాలో ఉన్న లెన్స్ కార్ట్ షాప్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తిలకం పెట్టి హిందూ సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ మాట్లాడుతూ ఉద్యోగులకు తమ విశ్వాసాలను గౌరవించుకునే హక్కు ఉందన్నారు. కార్యాలయాల్లో ఎటువంటి వివక్ష, గౌరవహననం జరిగితే వెంటనే స్పందించాలని సూచించారు.,కార్పొరేట్ సంస్థలు అన్ని మతాలను గౌరవించాలని, భారతీయ సంస్కృతిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే, గతంలో వంటి స్టార్‌బక్స్ సంస్థలపై కూడా ప్రజలు స్పందించి మార్పు తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. హెచ్చరికలు మరియు అభిప్రాయాలు మత విశ్వాసాలను అవమానించే విధానాలు కొనసాగితే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో భారతీయ విలువలను దూరం చేయడం సరైంది కాదన్నారు. మహిళలను గౌరవించే వాతావరణం ప్రతి సంస్థలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ భవాని సీనియర్ నాయకులు మన్నె యాదగిరి, తూము సైలేష్, ఐలయ్య డివిజన్ ప్రధాన కార్యదర్శి రవి గౌడ్.ఉపాధ్యక్షులు డి. శ్రీనివాస్, అభిలాష్, కార్తీక్, స్వామి ఓబీసీ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, దారా చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.




## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తొర్రూరు, ఏప్రిల్ 25 వాయిస్ టుడే : ప్రజలు న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తొరూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జ్ ధీరజ్ కుమార్ అన్నారు శనివారం మండలంలోని భోజ్యా తండాలో న్యాయ చట్టాలపై అవగాహన సదస్సు మరియు రహదారి భద్రత. చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ , ఎన్ డి పి ఎస్ యాక్ట్ , సైబర్ క్రైమ్ యాక్ట్ పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా తొర్రూరు జేసీజే కోర్టు న్యాయమూర్తి దామెర ధీరజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రాణ రక్షణ కోసం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం పోలీసుల కోసం కాదని, మీ ప్రాణాల రక్షణ కోసమని న్యాయమూర్తి సూచించారు.చట్టంపై అవగాహన కల్పిస్తు ప్రతి పౌరుడు ప్రాథమిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, వివాదాలకు దూరంగా ఉంటూ ప్రశాంతమైన జీవనం సాగించాలని కోరారు.రహదారి నిబంధనలు పాటిస్తూ మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి ప్రాణాంతకమని, ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని హెచ్చరించారు. “ఒక చిన్న నిర్లక్ష్యం ఒక కుటుంబాన్ని రోడ్డున పడేస్తుంది. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయం లో తలకు తగిలే గాయాల నుండి ప్రాణాపాయం తప్పుతుందన్నారు ఆడపిల్లలకు 18 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత పెండ్లి చేయాలని సూచించారు అలాగే యువత గంజాయి జోలికి పోకూడ దని వారి జీవితం నాశనం చేసుకోవ ద్దని భవిష్యత్తును కాపాడుకోవాలని న్యాయమూర్తి ధీరజ్ కుమార్ తెలిపినారు.ఈ కార్యక్రమంలో స్థానిక బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వి రత్నం , అడ్వకేట్స్ జి.రామకృష్ణ , ఎం నాగరాజు ,ఎం అశోక్, ఎం సంతోష్ ,టి. గౌస్, రమేష్, సర్పంచ్ మౌనిక తొర్రూరు ఎస్సై శివరామ కృష్ణ కోర్టు సిబ్బంది మరియు తండా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## జామా మసీదును తనిఖీ చేసిన అధికారులు

తొర్రూరు, ఏప్రిల్ 25 వాయిస్ టుడే : తొర్రూరు పట్టణ కేంద్రంలోని స్థానిక జామా మస్జిద్ ను రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ నజీముద్దీన్, మండల నాయబ్ తహసిల్దార్ నరసయ్య , మున్సిపల్ మేనేజర్ కట్ట స్వామి, ఎండి సలీంలు మస్జిద్ ను సందర్శించి తనిఖీ చేశారు మస్జిద్ కు సంబంధించిన 27 రూములను తనిఖీ చేసి షాప్ యజమానుల నుండి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అడిషనల్ రెవెన్యూ కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసి మస్జిద్ అగ్రిమెంట్ ప్రకారం షాపుల లీజు వివరాలను సేకరించామని సర్వే చేసిన వివరాలను రెవెన్యూ కలెక్టర్ కు అందజేస్తామని తెలిపారు. అనంతరం మస్జిద్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎండి అలీమ్, అమీర్ లు మాట్లాడుతూ మస్జిద్ కమిటీ అగ్రిమెంట్ ప్రకారం 15 సంవత్సరాల అగ్రిమెంట్ కాలం పూర్తి అయిన షాపులను ఖాళీ చేయాలని కమిటీ తరపున నోటీసులు పంపించిన కమిటీకి సహకరించకుండా వ్యవహరిస్తున్నారని ఇదే విషయాన్ని జిల్లా వక్ఫ్ అధికారులకు తెలియజేయడంతో సంబంధిత అధికారులు మస్జిద్ కు వచ్చి సర్వే చేయడం జరిగిందని తెలిపారు. కావున షాప్ యజమానులు ప్రభుత్వ అధికారులకు మస్జిద్ కమిటీకి సహకరించి మస్జిద్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్ రవీందర్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా కివి పబ్లిక్ స్కూల్ 24వ వార్షికోత్సవ వేడుకలు

వరంగల్ ( వాయిస్ టుడే ) ఏప్రిల్ 25 : అండర్ రైల్వే గేట్ కరీమాబాద్ ఎస్ ఆర్ ఆర్ తోట లో గల కివి పబ్లిక్ స్కూల్ స్థాపించి 24 వసంతాలు పూర్తిచేసుకుని 25 వసంతం లో అడుగు పెడుతున్న సందర్భంగా పాఠశాల యొక్క 24, వ వార్షికోత్సవ వేడుకల ను ఉర్సుగుట్ట వద్ద ఆకుతోట కన్వెన్షన్ లో అంగరంగ వైభవంగా కన్నుల పండుగ గా వేడుకల ను నిర్వహించరు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు, ప్రిన్సిపల్ అయిన దాసి సతీష్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు పేద మధ్య తరగతికి చెందినవారు ఉన్నత విద్య అభ్యసించడం కోసం ఒక చక్కటి పునాది ఏర్పాటు చేసే దిశలో పాఠశాల శిక్షణ వారికి అందుబాటులో ఉండే విధంగా మరియు వారిని ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దే విధంగా తర్ఫీదును తమ పాఠశాల లో అందించడం జరుగుతుందనీ అయన తెలియచేశారు.ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాజీపేట్ రైల్వే సి ఐ వడ్డే నరేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లలతో క్రమశిక్షణ పట్టుదల ఆత్మస్థైర్యం నింపేలా పాఠశాల పనిచేయడం అభినందనీయం అలాగే విద్యార్థులను ఎప్పటికప్పుడు మనం ప్రోత్సహిస్తూ వారిని గమనిస్తూ ఉంటే పిల్లలు చక్కటి విద్యావంతులుగా తయారై సమాజ నిర్మాణంలో వారు వారి పాత్ర ఆవశ్య కతను తెలుసుకొని మసులుకుంటారని తెలియజేశారు. మరొక్క ముఖ్యఅతిథి.. టస్మా రాష్ట్ర ప్రధాన నడిపెల్లి వెంకటేశ్వరావు పాఠశాలలో విద్యార్థులను సాధిస్తున్నటు వంటి విజయాలు మరియు వారి యొక్క రిజల్ట్ చాలా అభినందనీయమని, ఇంకా ముందు పాఠశాల చాలా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్ పాఠశాల డైరెక్టర్ దాసిరజని నామనీ సారంగపాణి, దాసి సారంగపాణి, కార్పొరేటర్ పల్లం పద్మ రవి, జిల్లా ప్రెసిడెంట్ శ్రీ ఆడెపుశ్యామ్, సెక్రటరీ ఠాకూర్ జ్ఞానేశ్వర్ సింగ్, చీఫ్ అడ్వైజర్ కోడం శ్రీధర్, హానరబుల్ ప్రెసిడెంట్ బిల్లా రవి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆడెపు వెంకటేశ్వర్లు, అకాడమిక్ కన్వీనర్ మడిపల్లి రాజు, , నాగపురి కిరణ్ కూరపాటి మోహన్, బండి చక్రపాణి వడిచర్ల ప్రసాద్, దడిగల రమేష్, శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు పాల్గొన్నారు.








# ఘనంగా వరంగల్‌లో శ్రీ భద్రకాళి భద్రేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు

### మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో వైభవంగా పూజలు, భారీ అన్నదానం

వరంగల్ (వాయిస్ టుడే) : వరంగల్‌లోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవాలయంలో శ్రీ భద్రకాళి భద్రేశ్వర స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలతో నగరమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనం పొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో, దాదాపు రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం ఈరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రకాళి అమ్మవారికి అభిషేకం, కల్యాణం, హోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరిగాయి. అనంతరం అమ్మవారిని పల్లకి సేవలో దేవాలయం చుట్టూ ఊరేగించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మందికి అన్నదానం ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. గోపాల నవీన్ రాజు పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. దేవాలయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ పాల్గొని మాట్లాడుతూ, తాను గత రెండు దశాబ్దాలుగా అమ్మవారి భక్తుడిగా ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలకు హాజరవుతున్నానని తెలిపారు. అమ్మవారి కృపతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు కటుకం పెంటయ్య పటేల్, గౌరవ అధ్యక్షులు గైనేని రాజన్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాల నవీన్ రాజు పటేల్, వరంగల్ జిల్లా అధ్యక్షులు ముస్కమల్లా సుధాకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద ఎత్తున మహిళలు, యువత, భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

దేవాలయం ప్రధాన అర్చకులు శేషయ్య పంతులు మరియు వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించాయి. స్థానిక పోలీసులు ట్రాఫిక్ నియంత్రణతో పాటు భద్రతా ఏర్పాట్లు చేపట్టి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. ఈ కల్యాణ బ్రహ్మోత్సవాలు వరంగల్ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత ప్రతిబింబించాయి.

# రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యం

## రాయిగూడెం 'ప్రజా దర్బార్'లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ఖమ్మం , ఏప్రిల్ 24 ( వాయిస్ టుడే ): ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నదే ఈ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని శనివారం రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. రాయిగూడెం, అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పల నరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి పొంగులేటి ముఖాముఖి భేటీ అయ్యారు. గతంలో ప్రజలు తమ గోడు చెప్పుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బందులు పడ్డారని, కానీ నేడు అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు వింటున్నారని మంత్రి తెలిపారు. "ఇది కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు, నిరంతరం జరిగే ప్రక్రియ. మీ కష్టాలను వినే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది కాబట్టే ధైర్యంగా మీ మధ్యకు రాగలుగుతున్నాం" అని పేర్కొన్నారు.

ప్రజా దర్బార్‌ను కేవలం సభలా కాకుండా, ప్రతి పంచాయతీకి ఒక క్లాస్‌రూమ్ కేటాయించి అధికారులను కూర్చోబెట్టడం ద్వారా సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. స్పాట్‌లోనే పరిష్కరించే వీలున్న సమస్యలను వెంటనే తేల్చేయాలని, మిగిలిన వాటికి వారం, నెల, మూడు నెలల చొప్పున గడువు నిర్ణయించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే. గెలిచిన తర్వాత ప్రభుత్వం అందరిది. అడిగిన పని న్యాయమైనదైతే, ప్రజలకు ఉపయోగపడేదైతే తప్పకుండా పూర్తి చేస్తాం" అని మంత్రి వివరించారు. ఈ నియోజకవర్గంలో చేస్తున్న ఈ ప్రయోగం రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అమలు చేయడానికి ఒక నమూనాగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

ఈనెల 27వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి సమస్యలను పారదర్శకంగా, వడివడిగా పరిష్కరించి ప్రజలకు మేలు చేకూరుస్తామని హామీ ఇచ్చారు. మీరు మనస్ఫూర్తిగా ఆశీర్వదించి నన్ను గెలిపించారు. మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ కష్టాలను తీర్చాల్సిన బాధ్యత నాపై ఉంది. అసాధ్యమైన హామీలు నేను ఇవ్వను కానీ.. మీరు అడిగే సమస్య న్యాయమైనదైతే దాన్ని పూర్తి చేసే బాధ్యత నాది" అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.

---

## మెజిస్ట్రేట్లను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ గోపిక రాణి



హనుమకొండ,వాయిస్ టుడే: జువనైల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు డా.కె.గోపిక రాణి బదిలీపై వెళ్తున్న మెజిస్ట్రేట్లను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ మెజిస్టీరియల్ 1వ అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ హన్మకొండ శ్రవణ స్వాతీ చింటాడా మరియు 3వ అదనపు మున్సిపల్ మెజిస్ట్రేట్ సిరిసిల్ల హారికను వారి చాంబర్ లో కలిసిన గోపిక రాణి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## విజయవంతంగా "ఎయిర్ ఎక్స్‌పీరియన్స్" కార్యక్రమం

**కేడెట్ల భవిష్యత్తుకు ఇది ప్రేరణగా నిలుస్తుంది**

**పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పల వీర ఉపేందర్**



హనుమకొండ,వాయిస్ టుడే: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కృష్ణా కాలనీకి చెందిన 24 మంది ఎన్‌సీసీ కేడెట్లకు ప్రత్యేకమైన "ఎయిర్ ఎక్స్‌పీరియన్స్" కార్యక్రమం శనివారం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం మామ్నూర్ ఎయిర్‌ఫీల్డ్‌లో జరిగింది. 4(ı) ఎయిర్ స్క్వాడ్రన్‌కు చెందిన కమాండింగ్ ఆఫీసర్ వింగ్ కమాండర్ ఆశిష్ భాస్కర్ ధనాకే ఆధ్వర్యంలో కేడెట్లకు మైక్రోలైట్ విమానంలో ఎగిరే అరుదైన అవకాశం కల్పించబడింది. ఈ అనుభవం కేడెట్లలో ధైర్యం,ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా భారతీయ వాయుసేనపై ఆసక్తిని పెంచింది. విమానం ఎగరడంలోని సాంకేతికతలను వివరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ కుందూరు సందీప్ కుమార్ సమన్వయం చేసి కేడెట్లను మార్గనిర్దేశనం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పల వీర ఉపేందర్ ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ..కేడెట్ల భవిష్యత్తుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థి జీవితంలో తొలిసారి విమానం ఎక్కిన ఈ అనుభవం చిరస్మరణీయమైన అనుభవంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రౌండ్ స్టాఫ్ సార్జంట్ శేఖర్ రెడ్డి,సార్జంట్ సుమన్ సింగ్,సార్జంట్-చాఖ సింగ్ పాల్గొన్నారు.

## గురుకులాల ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం

**క్రమశిక్షణే ఆభరణం – విజయమే గమ్యం**

**స్వేరో జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో**



ఖమ్మం, ఏప్రిల్ 25 ( వాయిస్ టుడే ): గురుకులాల ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం అని, ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యా సంవత్సరాన్ని అత్యంత క్రమశిక్షణతో, ఉత్తమ ఫలితాలతో పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు స్వేరో జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో శనివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో మాట్లాడుతూ.. విద్యార్థులను కేవలం పాఠాలకే పరిమితం చేయకుండా, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న జోనల్ ఆఫీసర్ అలివేలు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు, అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయ బృందానికి, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో వారు చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. వేసవి సెలవుల కోసం ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవాలని స్వేరో నెట్వర్క్ ఆకాంక్షిస్తుందన్నారు. సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేసేలా సముచిత మార్గదర్శకత్వం అందించాలని కోరారు. కొత్త లక్ష్యాలతో, రెట్టింపు ఉత్సాహంతో తదుపరి విద్యా సంవత్సరానికి సిద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ?ఈ సందర్భంగా స్వేరో జిల్లా కమిటీ తరుపున విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.



## ఘనంగా ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ఖమ్మం, ఏప్రిల్ 25 (వాయిస్ టుడే): ఖమ్మం సహకార నగర్‌లోని బ్రెయినీ స్టార్స్ మాంటెస్సోరి స్కూల్‌లో ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సమక్షంలో ఆనందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శ్రీ జైనుల్ పాషా ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. ఆయన మాట్లాడుతూ, విద్య అనేది పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అని, చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు, విలువలు అలవరచుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, వారిని మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కలసి సహకరించాలని ఆయన తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలతో అందరిని అలరించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యనిలు ఉజ్మా, శైలజ, సునీత, ప్రశాంతి, నీలిమ, మాధవి, నాగమణి, నగిన, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగం

**కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

సిరిసిల్ల, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే); రాజన్న సిరిసిల్ల జిల్లాలో 15వ ఆర్థిక సంఘం (Finance Commission) నిధుల వినియోగంలో భారీ అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయని జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గ రెడ్డి, బిజెపి సినియరు నాయకులు గూడూరి భాస్కర్ లు కోరారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పాలకవర్గాలు 28-02-2024 నాటికి రద్దు కావడంతో, రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా ఎన్నికలు నిర్వహించడం వలన 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన నిధులు విడుదలలో ఆలస్యం చోటు చేసుకుందని అనంతరం డిసెంబర్ 2025లో ఎన్నికలు జరగడంతో కేంద్ర ప్రభుత్వం ఆ నిధులను పంచాయతీ రాజ్ కమిషనర్ ద్వారా గ్రామ పంచాయతీ ల ఖాతాల్లో జమ చేసిందని అయితే, జిల్లా లోని పలు మండలాల్లో పనిచేస్తున్న పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు (పీూలు), జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (ఞావీ)లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పట్టించు కోకుండా నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ స్వరాజ్ పోర్టల్ ద్వారా పారదర్శకత కోసం ప్రతి పనికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి నిధులను పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది అన్నారు.



సంబంధిత అధికారులపై తక్షణ చర్యలు తీసుకోకపోతే, అందుబాటులో ఉన్న ఆధారాలతో గౌరవ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేపడతామని వారు స్పష్టం చేశారు.



## హమాలీ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

తొర్రూరు, ఏప్రిల్ 25 వాయిస్ టుడే : ప్రజల అవసరాల కోసం వినియోగించే వస్తువుల ఎగుమతి దిగుమతి చేస్తూ జీవిస్తున్న హమాలి వర్కర్స్ కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. తెలంగాణ ప్రగతిశీల హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వెలికట్టే గ్రామంలో జనరల్ బాడీ నిర్వహించారు. బంధు యాకయ్య అధ్యక్షతన జరిగిన ఈ జనరల్ బాడికి ముఖ్యఅతిథిగా రవి హాజరై ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 11 కోట్ల మంది హమాలీలు ఎగుమతులు దిగుమతులు చేస్తూ తమ జీవితాలను పూర్తిగా ప్రవర్తిలా కరిగించుకుంటున్నారని అన్నారు. అలాంటి హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా ఏర్పాటు చేయాలని దాని కోసం 1000 కోట్లు కేటాయించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రిటైర్ అయిన హమాలీలకు 5000 పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన హమాలీలకు ఇందిరమ్మ ఇండ్లు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని రవి కోరారు. కార్మికులు ఐక్యమై చైతన్యయుతంగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. టియుసిఐ తొర్రూర్ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఎండి షరీఫ్‌లి మాట్లాడుతూ 140వ మే డే ను కార్మిక వర్గం ఘనంగా నిర్వహించుకొని కార్మిక హక్కులను కాపాడుకోవాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు గౌరవ అధ్యక్షులుగా కొత్తపల్లి రవి, అధ్యక్షులుగా బంధు సోమయ్య, ఉపాధ్యక్షుడు జాతు కిషన్, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి యాకయ్య, సహాయ కార్యదర్శిగా జాటోతు లచ్చిరాం, కోశాధికారిగా పింగిలి వెంకన్న తో పాటు కార్యవర్గ సభ్యులుగా మరో 9 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హమాలీలకు సమగ్ర వేతన చట్టం చేయాలని హమాలీ రేట్లపై ప్రభుత్వం కేజీలు విడుదల చేయాలని సమావేశంలో తీర్మానించారు.



## దళితరత్న అవార్డు గ్రహీత సాయిరాజ్‌కు సన్మానం

**పాల్గొన్న తేజోమయి మాల కులసంక్షేమ సంఘం నాయకులు**

కాజీపేట,వాయిస్ టుడే: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు అందుకున్న కాజీపేట కు చెందిన నేరటి సాయిరాజ్ ను తేజోమయి మాల కులసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు సంఘం అధ్యక్షులు మర్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి బండి విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దళితరత్న నీరటి సాయిరాజ్ కు శాలువా కప్పి పూలమాలలు వేసి అంబేద్కర్ చిత్రపటాన్ని అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దళితరత్న సాయిరాజ్ మాట్లాడుతూ దళితులకు సామాజిక సేవ చేస్తూ దళితులకు ప్రభుత్వం నుంచి అందవలసిన పథకాలను అందరికి చేరవేసేలా కృషిచేస్తానని అన్నారు. ప్రతి ఒక్కరు అంబెద్కర్ ఆశయ సాధనలో ముందుకు సాగాలని కోరారు. తన తండ్రి స్వర్గీయ నీరటి సుదర్శన్ దళితుల అభ్యున్నతికి పాటుపడ్డారని గుర్తుచేసుకుంటూ..తేజోమయి మాల కులసంక్షేమ సంఘం కి వేసిన బీజాన్ని గుర్తుచేసుకున్నారు. దళితులను చైతన్యపరుస్తూ కుల సంఘాన్ని అభివృద్ధిపరుస్తూ తన తండ్రి ఆశయాలని కొనసాగిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి పప్పుల గోవర్ధన్, సభ్యులు సి.హెచ్ కొమ్మలు,కొండ్ర నర్సింగరావు, తండమల్ల వేణు,కాందారి రాజమౌళి,ఒగ్గుల భద్రయ్య, బండి రాంచందర్, పదిదాల శేఖర్ బాచి,బత్తుల సమ్మయ్య ,గాదె వెంకటస్వామి, మద్దెల కార్తీక్,బారాబరీ శ్రీకాంత్,మర్యాల ప్రవీణ్,పార్లపల్లి రాజేష్,బాదాం కుమారస్వామి, బండారి నర్సింగరావు,బొబ్బిలి రాజేందర్,జానపట్ల యాదగిరి, బోయిన వెంకట్రావు,చెలమళ్ళ రాజకుమార్,గొర్రె ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## దామెర మండలంలో సజావుగా ఉపాధిహామీ పనులు

**కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ**

హనుమకొండ,వాయిస్ టుడే: దామెర మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు ఏపీఓ శారద ఆధ్వర్యంలో సజావుగా సాగుతున్నాయి. శనివారం జరిగిన ఉపాధి హామీ పనుల్లో కూలీలు చెరువుకు సంబంధించిన పనులు చేశారు. ఈ పనులను గ్రామ సర్పంచి పెండ్లి రాజు,ఏపీఓ,గ్రామ కార్యదర్శి కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకి వంద రోజులు పూర్తయ్యేలా పని చేసుకోవాలని,కూలీలకు 307 రూపాయలు కూలీ వచ్చేలా అవగాహన కల్పించి ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా పని వేళలు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు పనిచేసుకోవాలని,హాజరుకు రెండు ఫోటోలు తప్పనిసరి అని తెలియజేశారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు డిస్ట్రిబ్యూట్ చేయడం చేశారు. తదుపరి దుర్గంపేట గ్రామంలో కూలీలకి మొబిలైజ్ చేపట్టారు. ప్రతి గ్రామంలో 100 పైన కూలీల రిపోర్ట్ ఉండేలా వార్డ్ వైస్ గా కూలీలని సేకరించారు. అలాగే ఊరుగొండ గ్రామంలో ఎస్సీ కాలనీ మరియు బీసీ కాలనీలలో సోమవారం నుండి పని మొదలు పెట్టుటకు కూలీల నుండి డిమాండ్ సేకరించారు. మండలంలో అన్ని గ్రామపంచాయతీలను పనులు మొదలైనవి కానీ కూలీల సంఖ్యను ఇంకా పెంచాలి అని తెలుపుతూ పని వద్ద సౌకర్యాలను గ్రామపంచాయతీ కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రెటరీలు సుప్రియ,సుకన్య,మేట మానస, రామ్మూర్తి,ఎఫ్ఎ రజిని,ఆశవర్కర్, తదితరులు పాల్గొన్నారు.

వాయిస్
హైదరాబాద్
ఆదివారం 26 ఏప్రిల్ 2026



## రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి

### సన్నరకాలు సాగు చేయాలి.. ప్యాడీ క్లీనర్లు వినియోగించాలి

### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ మెప్మా కొనుగోలు కేంద్రంలో పరిశీలన

సిరిసిల్ల, ఏప్రిల్ 25 (వాయిస్ టుడే): రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మెప్మా ఆధ్వర్యం లో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. ముందుగా ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి.. పలు సూచనలు చేశారు. టార్పాలిన్లు, గన్ని సంచులు, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని ఆరా తీసి.. పరిశీలించారు. ఇప్పటిదాకా ఎంత ధాన్యం వచ్చింది? సన్న రకం వడ్లు వచ్చాయా? అని అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లుల కేటాయింపు.. ఆన్లైన్లో వివరాల నమోదు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతులు ప్యాడీ క్లీనర్లు వినియోగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కేటాయించిన మిల్లులకు ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రైతులు సన్నరకం వడ్లు సాగు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ మహేష్ కుమార్ వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బాల్య వివాహం అడ్డుకున్న అధికారులు

### సిడబ్ల్యుసి ఎదుట హాజరు పరిచేందుకు బాలిక తరలింపు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే); ఎల్లారెడ్డిపేట మండలం లోని పోతిరెడ్డిపేట గ్రామం లో జరుగుతున్న బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. గ్రామం లో బాల్య వివాహం జరుగుతోందని రెండు రోజుల క్రితం 1098 కు సమాచారం అందడం తో తహసీల్దార్ సుజాత, ఐ .సి.డీ.ఎస్. సిరిసిల్ల సీడీపీఓ ఉమారాణి , సూపర్ వైజర్ వనిత, డీ.సి.పీ.ఓ కవిత చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ స్రవంతి , పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులను వివరాలు అడిగినా వారు సహకరించకపోగా తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు బాలిక చదివిన పాఠశాల నుంచి రికార్డులు సేకరించగా, 24-08-2009న జన్మించినట్లు ధృవీకరించారు. బాలిక వయస్సు చట్టపరంగా వివాహానికి తక్కువగా ఉండటంతో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి వివాహాన్ని నిలిపివేశారు. ఈ సమయంలో బాలిక బంధువులు అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. అంగన్వాడి టీచర్ సమాచారం ఇచ్చిందని ఆరోపిస్తూ ఆమెపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించిన ఘటన కూడా జరిగింది. అనంతరం బాలికను బాలల సంరక్షణ కమిటీ ఎదుట హాజరు పరిచేందుకు సిరిసిల్లకు తరలించారు. ఈ సందర్భం గా అధికారులు గ్రామస్తులకు బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ, అలాంటి వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.



## నాయి బ్రాహ్మణుడిపై దుర్భాష లాడుతూ చేయి చేసుకున్న ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్,ఏప్రిల్ 24(వాయిస్ టుడే): గడ్డం తీసుకోవడానికి క్షౌరశాలకు వచ్చిన ఎస్సై నాగిని అశోక్ చంద్రను కూర్చోండి అన్నా అన్న పాపానికి నానా దుర్భాషలుడుతూ ఆ ఎస్సై మానవత్వం మరిచి నాయి బ్రాహ్మణ సోదరుడిపై చేయించుకున్నాడు. కరీంనగర్ పట్టణంలోని ఖర్ఖానా గడ్డ న్యూ ప్రజా క్షౌరశాలలో పని చేస్తున్న పగడాల రాము షాపు శుభ్రపరస్తుండగా 3వ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ అశోక్ చందర్ యూనిఫారంలో వచ్చి గడ్డం తీయమనగా అన్నా కూర్చోండి అనడంతో కోపోద్రిక్తుడైన ఎస్.ఐ చందర్ నన్ను అన్నా అంటావా మ్యాకెలౌడే,లంజాకొడుకా అని బూతులు తిట్టుతూ కొట్టారు. విషయాన్ని నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు సంబంధిత పోలీస్ స్టేషన్ మరియు కరీంనగర్ సీపీకి లిఖిత పూర్వక పిర్యాదు చేసి ఎస్సై పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ బాధ్యులు మాట్లాడుతూ ఒక బాధ్యతగల పదవీలో ఉన్న పోలీస్ అధికారి దాదాగిరి చేయడం ఎంతవరకు న్యాయము.ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారి ఇలా దురుసుగా ప్రవర్తించడం చాలా బాధాకరం అన్నారు.ఎస్.ఐ. చందర్ పై కేసు నమోదు చేసి అతనిపై తగిన చర్యలు తీసుకొని వెంటనే సస్పెండ్ చేయాలని,అతనితో నాయిబ్రాహ్మణ కులానికి క్షమాపణ చెప్పించాలని డిమాండు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలం మొండయ్య నాయీ,జిల్లా గౌరవ అధ్యక్షులు ఔదుర్తి లక్ష్మణ్ కుమార్ మార్ నాయీ, నగర అధ్యక్షులు జంపాల సంపత్ నాయి,నగర ప్రధాన కార్యదర్శి కంది వెంకటేశ్ నాయి,సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఫీజు రీఎంఎస్మెంట్ పథకాన్ని ఎత్తివేసేనకు ప్రభుత్వం కుట్ర

### ఎబివిపి కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు



కరీంనగర్, ఏప్రిల్ 24(వాయిస్ టుడే): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న 10000 పైగా ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ ను విడుదల చేయాలని కలెక్టరేట్ మెయిన్ గేట్ ముందు నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు మాట్లాడుతూ పేద,బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతవిద్యను ఉచితంగా అందించాలనే సదుద్దేశంతో తీసుకొచ్చిన "ఫీజు రీయింబర్స్మెంట్" పథకాన్ని ఎత్తివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని, దీనిని ఎబివిపి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఎబివిపి జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు అన్నారు.ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై ప్రైవేట్ కళాశాలల యాజ మాన్యాలు గౌరవ హైకోర్టును ఆశ్రఉంచినప్పుడు, ప్రభుత్వం ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయాలని గౌరవ హైకోర్టు పదే పదే కోరినప్పటికీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయని కారణంగానే "విద్యార్థుల దగ్గరనుండే ఫీజులు వసూలు చేసుకోవచ్చని గౌరవ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని, ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం ఈ చర్యకు ఒడిగట్టిందని, ఇది రీయింబర్స్ మెంట్ పథకాన్ని బొంద పెట్టడంలో భాగమే అని అన్నారు.ఈ స్కీమ్ ద్వారా లక్షల మంది పేద వర్గాల పిల్లలు ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, లా లాంటి కోర్సులు పూర్తిచేసి దేశ విదేశాల్లో స్థిరపడి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాను ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం అయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై ఆధారపడి యేటా 14 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, కోర్సుల్లో ప్రవేశం పొందేటప్పుడే ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుందన్న హామీ మేరకే విద్యార్థులు అడ్మిషన్ పొందుతారని,హామీ మేరకు ప్రవేశం పొందాక ఫీజు చెల్లించకుండా, 10000 కోట్ల రూపాయల రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను నయవంచనకు గురిచేస్తుందన్నారు. విద్యపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి రాష్ట్ర,దేశ అభివృద్ధికి ఉపయోగపడే మానవవనరుల సృష్టి కోసమేనని, ఇది ఏ మాత్రం ఉచిత పథకం కాదని,ఈ విషయాన్ని ప్రభుత్వం, సమాజం అర్థం చేసుకోవాలన్నారు.ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పేద విద్యార్థులకు విద్యాప్రదాయినిగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని బారాస ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని,ఈ పథకాన్ని మా కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని,మేము అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లించడమే కాకుండా ఇంకా గొప్పగా అమలుచేస్తామని హామీ ఇచ్చారని,తీర అధికారం లోకి వచ్చాక స్వయంగా తానే విద్యా శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ఎత్తివేతకు కుట్రలు చేస్తున్నారన్నారు.నా దగ్గర పంచడానికి భూములు లేవు,కానీ జీవితాన్ని నిలబెట్టే విద్యను మాత్రం అందిస్తానని పదే పదే వల్లే వేసే రేవంత్ రెడ్డి ఎందుకు పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారో సమాధానం చెప్పాలన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజం అంతా కూడా ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై స్పందించాలని,ఎబివిపి ఆధ్వర్యంలో ఈ విద్యావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వంపై చేయబోయే ఉద్యమంలో మాతో పాటు కలిసి రావాలని పిలునిచ్చారు.విద్యార్థులతో గెలుక్కున్న ఏ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలువలేదని,నీ ప్రభుత్వానికి కూడా రోజులు దగ్గర పడ్డాయని,నీ ప్రభుత్వ మెడలు వంచైనా సరే ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని కాపాడుకుంటామని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏదైతే ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తేసి పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కుట్ర చేస్తుందో దానికి వ్యతిరేకంగా,అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు.ఈ కార్యక్రమంలో గోస్కుల అజయ్. భామండ్ల నందు.నగర కార్యదర్శి యోగేష్,స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మురళి,శ్రీపతి వంశీ,నాగరాజు, జిల్లా హాస్టల్ కన్వీనర్ విగ్నేష్,జిల్లా కేల్ కన్వీనర్ విష్ణు,నితీష్,శ్రీ వర్ధన్,ఆకాష్, శివ,మనోజ్ , అనూష పాల్గొన్నారు




## మలేరియా అంతం చేద్దాం...

### ఆరోగ్యమైన (సమాజాన్ని) రేపటి నీ నిర్మిద్దాం

ముస్తాబాద్, ఏప్రిల్ 25, (వాయిస్ టుడే); జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత అధ్యక్షతన ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా అంతం చేద్దాం- ఆరోగ్యమైన (సమాజాన్ని) రేపటి నీ నిర్మిద్దాం" అనే నినాదంతో ముస్తాబాద్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రపంచ మలేరియా దినోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ, మలేరియా ను జయిద్దాం- ప్రతి ఒక్కరం కలిసి కృషి చేద్దాం అని, మలేరియా అంతం చేసే దిశగా ఇప్పుడు మనం చేయగలం, ఇప్పుడు తప్పక చెయ్యాలి అనే నినాదంతో, జాగ్రత్తలతోటే మలేరియా దూరమవుతుందని, మలేరియా నివారణ పాటించవలసిన ముఖ్యమైన చర్యలు ఇళ్లల్లో, పరిసరాలలో నీటి నిల్వ ఉండకుండా చూడాలని, నీటి ట్యాంకులు, డబ్బాలు మూత లతో మూసి ఉంచాలని, కొబ్బరి చిప్పలు, కూలర్లు, నీటి నిల్వ తొట్టిలు కనీసం వారమునకు ఒక్కోసారి శుభ్రం చేసుకోవాల్సిందిగా దీని ద్వారా లార్వా వృద్ధి చెందదని, దోమ తెరలు వాడాలని, ఇంటి కిటికీలకు మెష్ డోర్లు బిగించాలని, దోమలు పెరగకుండా నివారణ కొరకు మందులు చల్లించాలని, ఒకవేళ దోమ కాటు వల్ల వణుకు జ్వరం , తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, వాంతులు అలసట ఉంటే వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్ష చేసుకోవాల్సిందిగా సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలలో విధిగా మంగళవారం, శుక్రవారం డ్రై డే పాటించవలసిందిగా ఆశాలకు, ఏఎన్ఎంలకు సూచించినారు. ఈ సందర్భంగా మనమంతా కలిసి మలేరియా రహిత జిల్లాను నిర్మించాలని, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పోతుగల్ సర్పంచ్ యాదమ్మ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సంపత్, డాక్టర్ నహిమ, ప్రాథమిక కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ ఆఫీజ, డాక్టర్ గీతాంజలి, డిప్యూడెమో రాజ్ కుమార్, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

## హిందూ ఏక్తా యాత్ర కోసం సిద్ధం కండి యాత్రను సక్సెస్ చేయాలి


### బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



కరీంనగర్, ఏప్రిల్ 24(వాయిస్ టుడే): హనుమాన్ జయంతి ( మే 12 ) సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ ఏక్తాయాత్రను బిజెపి శ్రేణులు సిద్ధం కావాలని,యాత్రను సక్సెస్ చేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.బిజెపి ముఖ్య నేతలతో నిర్వహించిన హిందూ ఏక్తాయాత్ర సన్నాక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కరీంనగర్లో ప్రతి ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో హిందూ ఏక్తా యాత్ర నిర్వహించడం ఒక ఆనవాయితీగా వస్తుందన్నారు. హిందువుల సంఘటత శక్తిని చాటేందుకు, లక్షలాదిమందితో జరిగే ఈ యాత్రకు తెలంగాణ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు వచ్చిందని తెలిపారు. కరీంనగర్లో జరిగే భారీ ఆధ్యాత్మిక కార్యక్రమంగా హిందూ ఎక్తాయాత్రకు ఖ్యాతి గుర్తింపు లభించిందన్నారు.గత 12 ఏళ్లుగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం కరీంనగర్ నగరాన్ని కాషాయమంగా మార్చుతూ ప్రతి ఏటా ఎంతో ఘనంగా,వైభవంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ నిర్వహిస్తున్నారని తెలిపారు. వైశ్య భవన్ నుండి ప్రారంభమై కరీంనగర్లోని ప్రధాన కూడళ్ల మీదుగా కొనసాగే ఈ యాత్ర అశేష హిందూ బంధువుల,వివిధ హిందూ సంఘాల భాగస్వామ్యంతో విజయవంతంగా కొనసాగుతుందన్నారు.ఆ దిశలోనే బిజెపి శ్రేణులు సైతం హిందూ ఏక్తా యాత్ర ను విజయవంతం చేయడానికి తగిన కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మేయర్ కొలగని శ్రీనివాస్,రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ సునీల్ రావు,కార్పొరేటర్ లు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ విలీనంపై హర్షం

### కరీంనగర్‌లో సీఎం రేవంత్, మంత్రి పొన్నం చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణుల పాలాభిషేకం



కరీంనగర్,ఏప్రిల్ 24(వాయిస్ టుడే): తెలంగాణ ఆర్టీసీ కార్మికుల దశాబ్దాల కలను నెరవేరుస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, 11శాతం పీఆర్సీ ప్రకటించడంతో పాటు అన్ని డిమాండ్లను నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ కరీంనగర్‌లో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వన్ డిపో వద్ద సంబరాలు అంబరాన్నంటాయి. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ నేతృత్వంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.అనంతరం ఆర్టీసీ కార్మిక సోదరులకు కాంగ్రెస్ నేతలు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మిక సోదరులకు ఇది చారిత్రక రోజు మాటలు చెప్పి మోసం చేసిన గత పాలకుల కళ్ళు తెరిపించిన రోజు అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారం,రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో నేడు ఆర్టీసీ విలీనం, 11శాతం పీఆర్సీ సాకారమయ్యాయి. ఇది కార్మిక పక్షపాత ప్రభుత్వానికి నిదర్శనం.దశాబ్దాలుగా కన్నీళ్లు పెట్టుకున్న ఆర్టీసీ కుటుంబాల్లో నేడు వెలుగులు నింపాం.కార్మికుల ఉసురు పోసుకున్న వాళ్లకు ఇది చెంపపెట్టు. మా ప్రభుత్వం ఎప్పుడూ కార్మికుల పక్షానే ఉంటుంది అని అన్నారు.ఆర్టీసీ కార్మిక సంఘం ఐఎన్టియుసి జిల్లా కార్యదర్శి టి ఆర్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ మా గోడు విన్నారు.మా బతుకులు మార్చారు. ప్రభుత్వంలో విలీనం అంటే మాకు ఉద్యోగ భద్రత.11శాతం పీఆర్సీ అంటే మా పిల్లల భవిష్యత్తు.మా కుటుంబాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.ముఖ్యమంత్రికి, మంత్రివర్గ సభ్యులకు కరీంనగర్ జిల్లా ఆర్టీసీ కార్మికుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ముస్తాక్ అహ్మద్,కుంభాల రాజు కుమార్,వీర దేవేందర్,శ్రీరాముల రమేష్, ఇమ్రాన్,గడప శ్రీనివాస్,ఇమ్రాన్, పెంట శేఖర్,అరుణ్,శ్రీనివాస్ గౌడ్, వసీం,యూనియన్ నాయకులు టిఆర్ రెడ్డి,ఎన్ కె దాసు,యూనియన్ నాయకులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**

# బీజేపీ ఖాతాలో మరో విజయం

## నగర కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

కరీంనగర్, ఏప్రిల్ 24(వాయిస్ టుడే): కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక రాజకీయంగా భారతీయ జనతా పార్టీ విజయం కాదని,ఇది నగర ప్రజల విజయం అని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.కరీంనగర్ లో నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఐదుగురు కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో పాటు ముగ్గురు బీఆర్ఎస్ సభ్యులు కూడ మద్దతు తెలుపుతూ చేయి ఎత్తి బలపరచడంతో ఐదు స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది.విజయం సాధించి కో-ఆప్షన్ సభ్యులు గా ఎన్నికైన కన్న కృష్ణ,చిగిరి వెంకటమ్మ, ఎలగందుల నందకుమార్,మైనారిటీ కోటాలో బల్బీర్ సింగ్,అఫీజాబేగంలు గౌరవ మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేసి, గెలుపు పత్రాలను అందించారు. గెలిచిన అభ్యర్థులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.భారతీయ జనతా పార్టీకి చెందిన 34 మంది పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా, బీఆర్ఎస్ కు చెందిన మరో ముగ్గురు సభ్యులు ఎన్నుకోవడంతో ఐదుగురు అభ్యర్థులకు 37 ఓట్ల చొప్పున వచ్చాయి.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో కో-ఆప్షన్ సభ్యుల సేవలు ఎంతో కీలకమని అన్నారు.భారతీయ



జనతా పార్టీ తరుపున బరిలో నిలిచిన 5 గురు కో-ఆప్షన్ సభ్యులు విజయం సాధించడంతో మా పాలకవర్గానికి మరింతబలం చేకూరిందని తెలిపారు.ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి కార్పోరేషన్ మేయర్ పీఠం దక్కడం కో-ఆప్షన్ ఎన్నికలో కూడ బీజేపీ తన పట్టును నిరూపించుకొవడం కేవలం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తో సాధ్యమైందని కొనియాడారు.ఈ విజయంతో కార్పొరేషన్‌లో బీజేపీ బలం మరింత పెరిగినట్లయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.ఇంతటి విజయాన్ని అందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్,బీజేపీ పాలకవర్గ సభ్యులకు నగర ప్రజల పక్షాణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నగర అభివృద్ధికి పాలకవర్గ సభ్యులతో పాటు కో-ఆప్షన్ సభ్యుల సహకారం చాలా అవసరం అన్నారు. అర్హులైన వ్యక్తులను ఈ పదవులకు ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.నగర ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండ మా పాలకవర్గం పని చేస్తూ కరీంనగర్ నగరాన్ని మరింత అభివృద్ధి బాట పట్టిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## కరీంనగర్ కార్పొరేషన్‌లో కో ఆప్షన్ ఎన్నికల్లో చక్రం తిప్పిన బండి సంజయ్

**ఐదింటికి 5 స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ**

**4రు బారస కార్పొరేటర్లు బీజేపీ అభ్యర్థులకు జై కొట్టిన వైనం**

**బీజేపీ కో అప్షన్ సభ్యుల గెలుపు పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ హర్షం**

కరీంనగర్, ఏప్రిల్ 25(వాయిస్ టుడే): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో కాషాయ జెండా మోసిన కార్యకర్తలకే పదవుల పట్టం కట్టారు.ఆచితూచి ఎంపిక చేయాలనే బండి ఆదేశాలను పక్కాగా అమలు చేసిన అభ్యర్థులు ఎంపిక కమిటీ సభ్యులు.అభ్యర్థుల ఎంపికపై సంతోషం వ్యక్తం చేసిన బీజేపి కార్పొరేటర్లు,పార్టీ శ్రేణులు. చెమట ఒడ్చిన కార్యకర్తలకే పట్టం కట్టడంపై బీజేపీలో సంబురాలు చేసుకున్నారు.బీజేపీ అభ్యర్థుల ఎంపికపై ఇతర పార్టీలు ఆశ్చర్యానికి గురయ్యారు.మైనార్టీ విభాగంలో పార్టీని నమ్ముకుని పని చేసిన ముజీబ్ తల్లికి ప్రధాన్యం,గత రెండు దశాబ్దాలుగా సామాన్య కార్యకర్తగా బిజెపిలో ఉన్న ముజీబ్.ముజీబ్లాంటి కార్యకర్తకు కో ఆప్షన్ ఇవ్వడం గొప్ప నిర్ణయం అంటున్న బిజెపి శ్రేణులు పట్టణంలో సిక్కుల ప్రాధాన్యత దృష్ట్యా సామాన్య కార్యకర్తకు కోఆప్షన్ సభ్యుడిగా అవకాశం.కీలక పదవి తనకు ఇవ్వడంపై అవాక్కైనా బల్వీర్ సింగ్.పార్టీని నమ్ముకుని ప్రజల్లో తిరుగుతున్న బల్వీర్ సింగ్ కి పదవి ఇవ్వడం పట్ల సంతోషంలో ఉన్న సిక్కులు.అత్యంత సామాన్య కార్యకర్త నిరుపేద అయిన నందన్ కుమార్ కు మరో కో ఆప్షన్ పదవి. బొమ్మకల్ ప్రాంతానికి చెందిన నందన్ కుమార్ అత్యంత సామాన్య కార్యకర్త కనీసం ఉండడానికి సరైన ఇల్లు లేదు. నందకుమార్ ఎంపికపై నిర్ఘాంత పోయిన ఇతర పార్టీలు ప్రజలు.ఈ ఎంపికతో బిజెపి కార్యకర్తలకు ఎంతటి ప్రాదాన్యతని ఇస్తుందని అర్థమవుతుందని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న ప్రజలు.పార్టీ జెండా మోస్తూ బిజెపినీ ప్రాణంగా భావిస్తున్న నంద కుమార్ కు కీలక పదవి ఇవ్వడంపై శ్రేణుల్లోనూ సంబరాలు.ఎస్సీ మహిళా విభాగంలో చిగురు రవి తల్లి చిగురు వెంకటమ్మకు అవకాశం ఇచ్చిన బిజెపి.మాజీ కార్పొరేటర్ గా ప్రజలకు మంచి పని చేసిన సామన్యురాలికి మరోసారి కార్పొరేషన్ లో అడుగుపెట్టే అవకాశం ఇచ్చిన బిజెపి.వైశ్య కులానికి చెందిన కన్నె కృష్ణకు అవకాశం ఇచ్చిన బిజెపి.పట్టణంలో మంచిపట్టున్న కన్నె కృష్ణకు పదవి రావడం పట్ల ఆర్యవైశ్యుల్లో ఆనందం.పదవిలో పంపిణీలో సామాజిక సమీకరణాలు పాటించిన బండి సంజయ్.ఎలాగూ గెలవమని ఓటింగ్ కు హాజరు కాకుండా పరువు నిలబెట్టుకున్న కాంగ్రెస్,సామాన్యులకు అవకాశం ఇవ్వడం పట్ల లోలోపల ప్రశంసలు అందుకున్నారు.



## లేబర్ కోడ్స్ రద్దుకై పోరాటాన్ని ఉధృతం చేయండి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 25: చికాగో అమరవీరుల, మే డే స్ఫూర్తి తో కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదాం అని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఫ్ టి యు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. హరిత పిలుపునిచ్చారు. శనివారం భైంసా మండలం వనాల్పాడ్ లో మే డే పోస్టర్ విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐరాపాలో జరిగిన పారిశ్రామిక విప్లవం నుండి ఆధునిక కార్మిక వర్గం ఉద్భవించిందని కొత్త యాంత్రికరణ విష్కరణలతో పోటీ పడలేక పనిగంటలను తగ్గించాలని కార్మిక వర్గం పోరాడిందని మే ఒకటి 1886న అమెరికాలోని చికాగో లో 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేస్తూ కార్మికులు నిరసనలు, ఆందోళనలు చేపట్టారని, పెట్టుబడిదారి వర్గం ఈ శాంతియుత ప్రదర్శనలపై కాల్పులు జరిపిందని, కార్మికులు తూటాలకు బలయ్యారని తిరుగుబాటు నాయకులను ఉరితీసారని కేసులు పెట్టి తీవ్ర అణిచివేతకు పాల్పడి జైలు శిక్షలు విధించారనీ, ఈ కార్మికుల బలిదానాల రక్త దర్పణులతో మే డే చరిత్ర లో నిలిచిపోయిందని అన్నారు.కార్పొరేట్ పెట్టుబడి దారులకు కార్మికుల రక్తాన్ని ధరబోసే చట్టాలను కేంద్రం చేస్తూ, కార్మికులను బానిసలుగా మారుస్తున్నదని, లేబర్ కోడ్స్ రద్దుకై పోరాటాన్ని ఉధృతం చేయండి అనే పిలుపుతో 140 వ మే డే విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, నరేందర్, భారతి, లక్ష్మి, శ్యామల, వనిత తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా బాధ్యత స్వీకరించిన ఆవుల



సూర్యాపేట: ఏప్రిల్ 25(వాయిస్ టుడే ప్రతినిధి) : సూర్యాపేట జిల్లా, కోదాడకు చెందిన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల రామారావు ఖమ్మం జిల్లా బాధ్యులుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని సంఘం గౌరవాధ్యక్షులు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నుంచి శనివారం స్వీకరించారు.ఖమ్మం జిల్లాలో మున్నూరుకాపులందరిని మరింత సమన్వయం చేస్తూ,వారి సంక్షేమానికి,ఉన్నతికి,సంఘం బలోపేతానికి కృషి చేయాల్సిందిగా కోరుతూ ఎంపీ రవిచంద్ర ఆయనకు పలు సూచనలు చేశారు,సలహాలిచ్చారు.ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, ప్రముఖులు రౌతు కనకయ్య, రమేష్ హజారీ,మరికల్ పోత సుధీర్ కుమార్,ఊసా రఘు,పలుగుల శ్రీనివాస్,సిలిగిరి విక్రమ్ తదితరులు ఉన్నారు.



## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

### దేగాంలో మహిళ సమైక్యభవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 25: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని లిఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్లి అన్నారు. శనివారం భైంసా మండలం లోని దేగాం గ్రామం లో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన గ్రామ మహిళ సంఘభవనాన్ని ప్రారంభించిన సందర్భంగా అయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం నిధుల తో సంఘ భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. భైంసా మండలానికి 40 కి పైగా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చే యడం జరిగిందన్నారు. రాష్టంలో నే మొదటి సారిగా భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించినందుకు సర్పంచ్ సుష్మరెడ్డి, అధికారుల పని తీరును అయన అభినందించారు.. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు విన్నవించడం తో దశల వారిగా గ్రామ అభివృద్ధి కి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. సిరాల ప్రాజెక్ట్ ద్వారా దేగాం ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరగా, కొన్ని చోట్ల మచ్కల్ సమీపంలో కాలువను తవ్వేశారని 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించి కాలువ ను పూర్తి స్థాయి లో నిర్మించి సాగునీటిని అందిస్తామన్నారు... అభివృద్ధే ధ్యేయం గా తాను ముందుకు సాగుతున్నాని, 28 ప్యాకేజి పూర్తి అయితే నియోజకవర్గం సస్యశామలం అవుతుందన్నారు. అదే విధంగా భూగర్భజాలలను పెంచేందుకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని డి. ఆర్. డి. ఎ. పి డి. విజయలక్ష్మి సూచించారు. అనంతరం సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి మాట్లాడుతూ తాను ఒక సామాన్య మహిళ నుండి సర్పంచ్ గా కావడం లో గ్రామస్తుల ఎమ్మెల్యే సహకారం ఎంతో ఉందన్నారు.. గ్రామ అభివృద్ధి కి దశల వారిగా నిధులు ఇస్తున్న ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు చెప్పారు.. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కు గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు స్వాగతించి శాలువ తో సత్కరించారు.. కార్యక్రమం లో అధికారులు, నాయకులు, ఆయా గ్రామల సర్పంచ్ లు పాల్గొన్నారు.

## వేసవిలో ఆర్టీసీ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

### నిర్మల్ డిపో మేనేజర్ పండరి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 25: నిర్మల్ జిల్లా నిర్మల్ డిపో లో వేసవి తీవ్రత దృశ ఆర్టిసి ఉద్యోగులు ముఖ్యంగా డ్రైవర్లు కండక్టర్లు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డిపో మేనేజర్ పండరి సూచించారు. శనివారం బస్సు డిపోలో డ్యూటీ కి వెళ్తున్నా డ్రైవర్ కండక్టర్లకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవిలో వేడి గాలి నుండి తల రక్షణ కోసం తెల్లని కాటన్ వస్త్రం తల బాగానా ధరించాలని విధులకు వెళ్ళేటప్పుడు కనీసం ఐదు లీటర్ల తాగునీటి క్యాన్లు వెంట తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.



## డ్యాన్స్ ,డ్రామా శిక్షణ తరగతుల పోస్టర్ విడుదల చేసిన సర్పంచులు సొల్లు అజయ్ వర్మ, చింతల అనిల్, సామ రాజి రెడ్డి,

తిమ్మాపూర్,ఏప్రిల్ 24(వాయిస్ టుడే): వేసవి సెలవుల సందర్భంగా స్పార్క్ల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ (గుండ్లపల్లి )లో మే 2వ తేది నుండి నెల రోజులు నిర్వహించనున్న డాన్స్,డ్రామా (చిల్డ్రన్ ఆక్టింగ్ ) క్లాస్సెస్ సంబందించిన పోస్టర్ ను సర్పంచ్ లు చింతల అనిల్ (గుండ్లపల్లి స్టేజి),సొల్లు అజయ్ వర్మ (గునుకుల కొండాపూర్ ),సామ రాజిరెడ్డి (పీచుపల్లి) ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్పార్క్ల్ స్కూల్ యాజమాన్యం, మాస్క్ ఇన్స్టిట్యూట్ (ఆక్టింగ్ ),డిస్క్ డాన్స్ అకాడమీ కోచ్ లు,మాస్క్ ఇన్స్టిట్యూట్,డిస్క్ డాన్స్ అకాడమీ, కరీంనగర్,స్థానికులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ చరిత్రలో సువర్ణ అధ్యాయం

**మాటలు చెప్పి మోసం చేసిన వాళ్లకు ఇది చెంపపెట్టు**

**ఎమ్మెల్యే, డా.మేడిపల్లి సత్యం**

**గత పాలకులు 10 ఏళ్లలో చేయలేనిది
మేము రెండున్నర ఏళ్లలో చేసి చూపించాము**

**ఎమ్మెల్యే, డా. కవ్వంపల్లి సత్యనారాయణ**



కరీంనగర్,ఏప్రిల్ 24(వాయిస్ టుడే): ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నేతలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను నెరవేరుస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, 11శాతం పీఆర్సీ ప్రకటించడంతో పాటు వారి అన్ని డిమాండ్లను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం చారిత్రాత్మక ఘట్టం అని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం,రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్,మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు.ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను నుహైదరాబాద్ లోని మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం,ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని నేతలు అన్నారు.గత పాలకులు మాటలకే పరిమితమైతే,మా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేతలతో చరిత్ర సృష్టించిందని,ఆర్టీసీ విలీనం, 11శాతం పీఆర్సీ,సంఘాల ఎన్నికలకు అనుమతి ఇవన్నీ కార్మిక పక్షపాత ప్రభుత్వానికి నిదర్శనం అని దశాబ్దాల పోరాటానికి ఫలితం దక్కింది అని కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆర్టీసీ కార్మికుల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని పేర్కొన్నారు.

## తెలంగాణ జాగృతి రాష్ట్ర యూత్ అధ్యక్షుడు రాము యాదవ్‌తో కాంగ్రెస్ అధికార ప్రతినిధి భేటీ



వాయిస్ టుడే ప్రతినిధి ఏప్రిల్ 25: తెలంగాణ జాగృతి రాష్ట్ర యూత్ అధ్యక్షులుగా ఎన్నికైన రాము యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాము యాదవ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రాము యాదవ్ తన స్నేహితుడని పేర్కొన్న నల్లాల వినయ్ కుమార్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాము యాదవ్‌ను రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా నియమించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ స్నేహపూర్వకంగా కలవడం జరిగిందన్నారు. ఇది పూర్తిగా మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని, ఇందులో ఎలాంటి రాజకీయ పరిణామాలు లేవని నల్లాల వినయ్ కుమార్ స్పష్టం చేశారు.

## నిరుపేద ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ సర్కార్



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 25: కడెం మండలంలో 61 కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నిరుపేద ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం తోడుగా ఉంది , ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని , మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఉచిత బస్సు, మహిళా సంఘాల ద్వారా రుణాలు, ఆర్టీసీ బస్సుల కొనుగోలు కార్యక్రమాలు చేస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు , లబ్దిదారులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**